వేటుకు వేళాయె!

రూ.54.97 లక్షల బిల్లుల వ్యవహారంలో ప్రభుత్వం నిర్ణయం

- వైసీపీ హయాంలో గుడివాడలో బరి తెగించిన కాంట్రాక్టర్లు, అధికారులు
- 19 మంది మున్సిపల్ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు కూటమి ప్రభుత్వం ఆదేశం
- అప్పట్లో మాజీ మంత్రి నాని ద్వారా బిల్లులు చెల్లించాలంటూ ఒత్తిడి
- నాడు చక్రం తిప్పిన అరాచక కాంట్రాక్టర్
- రికార్డుల్లేవు, అగ్రిమెంట్‌లు లేవు, ఎం.బుక్‌లు అసలే లేవు
- బిల్లుల చెల్లింపులు నిలుపుదల చేసిన నాటి ఉన్నతాధికారులు
- అప్పుడే ఈ విషయం వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



ఆంధ్రజ్యోతి - గుడివాడ: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో గతంలో అనేక కారణాలతో సి.బిల్లుల చెల్లింపులను నిలిపివేశారు. పనులు సక్రమంగా జరగలేదని, రికార్డులు లేవని, కనీసం అగ్రిమెంట్ కూడా చేసుకోకుండా, ఇష్టానుసారంగా నాటి అధికార పార్టీ కాంట్రాక్టర్‌లకు పనులను అప్పగించారని అప్పట్లో మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్, కాంట్రాక్టర్ పాలంకి సారధిబాబు నిరసన కూడా తెలిపారు. దీనిపై స్పందించిన డీఎంఏ (డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) రాజమండ్రి ఆర్డీని విచారణ అధికారిగా నియమించారు. విచారణ పూర్తి చేసిన ఆయన నివేదికను డీఎంఏకు సమర్పించారు. ఎట్టి పరిస్థితుల్లో తమ పార్టీ కాంట్రాక్టర్‌లకు బిల్లులను చెల్లించాలని మున్సిపల్ అధికారులపై నాటి ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే అదే సమయంలో ఎన్నికల నగారా మోగడంతో బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. గుడివాడ పురపాలక సంఘం పరిధిలో కంటిన్‌జెంట్ బిల్లుల పేరుతో ఐదేళ్ల వైసీపీ పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారనే ఆరోపణలున్నాయి.

69 పనులకు రూ.54,97,531 బిల్లులు

2022-2023 ఆర్థిక సంవత్సరంలో 69 పనులకు గాను రూ.54,97,531 కంటిన్‌జెంట్ బిల్లులను పెట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' 2024, ఏప్రిల్ 6వ తేదీన 'నాడు అక్రమం.. నేడు సక్రమం' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. అప్పటి కలెక్టర్ రంజిత్ బాషా పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డీఎంఏకు లేఖ రాశారు. దీంతో డీఎంఏ ముందస్తుగా ఎటువంటి చెల్లింపు చేయరాదంటూ మౌఖిక ఆదేశాలను జారీ చేశారు. ఈ నేపథ్యంలో బినామీ కాంట్రాక్టర్లు అప్పటి కమిషనర్, అకౌంట్స్ అధికారిపై తీవ్రస్థాయిలో ఒత్తిడిని తీసుకువచ్చారు. ఏకంగా అసిస్టెంట్ కమిషనర్ రంగారావు బిల్లులను చెల్లించాలంటూ ఉద్యోగులపై మిగతా 6లో..

> గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు, పలువురు అధికారులు బరితెగించారు. రికార్డులు, అగ్రిమెంట్లు, ఎం.బుక్‌లు లేకుండా చేసిన 69 పనులకు రూ.54.97 లక్షల బిల్లులు పెట్టారు. వాటిని చెల్లించాలని మాజీ మంత్రి కొడాలి నాని ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో అనేక ఆరోపణలు రావడంతో బిల్లుల చెల్లింపులను అధికారులు నిలుపుదల చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి కూటమి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. పరిశీలించిన ప్రభుత్వం 19 మంది మున్సిపల్ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది.

చెల్లింపులు నిలిపివేసిన డీఎంఏ

ఈ విషయంలో అసలుకే మోసం వస్తుందని భావించి బిల్లుల చెల్లింపును మున్సిపల్ అధికారులు నిలుపుదల చేశారు. అప్పటి కమిషనర్, అకౌంట్స్ అధికారులు సదరు బిల్లుల్లోని లోపాలను తెలియజేస్తూ డిపార్టుమెంట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గుంటూరు, రీజనల్ డైరెక్టర్, రాజమండ్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో బిల్లుల చెల్లింపును నిలుపుదల చేయాలని డీఎంఏ మౌఖిక ఆదేశాలను జారీ చేశారు. మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణను విచారణ అధికారిగా నియమించగా, విచారణ పూర్తి చేసి నివేదికను డీఎంఏకు అందించారు. అప్పటి మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు అడబాల అప్పారావు, అతని కుమారుడు మున్సిపల్ కాంట్రాక్టర్ హేమంత్, మరో ఇద్దరు కాంట్రాక్టర్లు నానితో డీఎంఏకు పలుమార్లు ఫోన్ చేయించి బిల్లులను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో ఎన్నికల నగారా మోగడంతో చెల్లింపులకు బ్రేక్ పడింది.

జ్యోతి వెలిగించి కృష్ణా తరంగ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వీసీ కూన రాంజీ, రిజిస్ట్రార్ ఉష



విలువైన సమయం వృథా చేయెుద్దు

- సోషల్ మీడియాకు బానిసలు కావొద్దు
- అవసరం మేరకే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి
- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు
- కృష్ణా వర్సిటీలో ఘనంగా కృష్ణాతరంగ్-2025 ప్రారంభం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత తమ విలువైన సమయాన్ని వృథా చేయవద్దని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. బందరు మండలం రుద్రవరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో కృష్ణాతరంగ్, అంతర కళాశాలల యువజనోత్సవాలు- 2025 గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు బానిసలు కావొద్దని చెప్పారు. అవసరం మేరకే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని సూచించారు. ఎక్కువ సమయం లక్ష్య సాధనకు నైపుణ్య అభివృద్ధి కోసం ఉపయోగించాలని హితవు పలికారు. యువతలో తగిన సమయంలో స్ఫూర్తిని నింపి మార్గనిర్దేశం చేస్తే దేశానికి గొప్ప సంపదగా తయారవుతారని చెప్పారు. విశ్వవిద్యాలయాలు విజ్ఞాన కేంద్రాలని, విద్యను మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని బోధించాలని తెలిపారు. సంస్కారవంతమైన భారతీయులుగా తయారు చేయాలని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. మాతృభాష, మాతృమూర్తి, మాతృదేశంపై ప్రతి ఒక్కరికీ అభిమానం ఉండాలని, మాతృభాష అయిన తెలుగును గౌరవించుకోవాలని, తెలుగుచదువుకున్న వారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలకు చెప్పానన్నారు. మచిలీపట్నంలో జన్మించిన ప్రముఖ సినీ నిర్మాత రఘుపతి వెంకయ్యనాయుడు, బ్రహ్మర్షిగా పేరుపొందిన రఘుపతి వెంకటరత్నంనాయుడు బందరులో జన్మించిన వారేనన్నారు. క్రికెట్ క్రీడాకారుడుగా పేరొందిన పద్మశ్రీ సి.కె.నాయుడు బందరు నుంచే తన క్రికెట్ ప్రస్తానం ప్రారంభించారన్నారు. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థుల్లో మిగతా 6లో..

24 మంది డిప్యూటీ ఎంపీడీవోలు

విధుల్లో చేరిక

మచిలీపట్నం టౌన్ , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టుల్లో జిల్లా వ్యాప్తంగా 25 మంది నియమితులయ్యారు. వీరిలో 24 మంది ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం విధుల్లో చేరారు. బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఎన్.ఎస్.మూర్తి మచిలీపట్నం రూరల్ మండలానికి, లక్ష్మీపురం గ్రామ కార్యదర్శి సిహెచ్.ఉమామహేశ్వరరావు గూడూరు మండలానికి, కొండపావులూరు గ్రామ కార్యదర్శి జి.సత్యసాయిబాబు గన్నవరం మండలానికి, గుడివాడ డీఎల్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్న సిహెచ్.వి.కోటేశ్వరరావు పెనమలూరు మండలానికి, హనుమంతపురం గ్రామ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం నందివాడ మండలానికి, పెదమద్దాలి గ్రామ కార్యదర్శి పి.పూర్ణచంద్రరావు పెదపారుపూడి మండలానికి, అంగలూరు గ్రామ కార్యదర్శి ఎలీషారావు గుడ్లవల్లేరు మండలానికి, డీపీవో కార్యాలయంలో పనిచేస్తున్న కె.పద్మావతి అవనిగడ్డ మండలానికి, పునాదిపాడు గ్రామ కార్యదర్శి డి.బాపూజీ కంకిపాడు మండలానికి, డీపీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.బాలాజీ చల్లపల్లి మండలానికి, అగ్నిపర్రు గ్రామ కార్యాదర్శి కె.పిచ్చయ్య పమిడిముక్కల మండలానికి, విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఉంగుటూరు మండలానికి, విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో పనిచేస్తున్న వి.శ్యామ్‌సన్‌బాబు తోట్లవల్లూరు మండలానికి, వక్కలగడ్డ గ్రామ కార్యదర్శి బొమ్మసాని వెంకట సుబ్బారావు పామర్రు మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. లక్ష్మీపురం గ్రామ కార్యదర్శి యార్లగడ్డ శివరామప్రసాద్ ఘంటసాల మండలానికి, పెడన ఎంపీపీ కార్యాలయంలో పనిచేస్తున్న బి.విజయకుమార్ నాగాయలంక మండలానికి, కరగ్రహారం గ్రామ కార్యదర్శి కూరేటి నరసింహారావు కృత్తివెన్ను మండలానికి, నడకుదురు గ్రామ కార్యదర్శి డేగల ఝాన్సీలక్ష్మి బంటుమిల్లి మండలానికి, జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇ. హారతి నిర్మల్ ఉయ్యూరు మండలానికి, పోతేపల్లి గ్రామ కార్యదర్శి జి.నరసింహారావు గుడివాడ మండలానికి, అవనిగడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్.హేమప్రకాష్ పెడన మండలానికి, కోసూరు గ్రామ కార్యదర్శి నెమలికంటి కృష్ణవేణి శ్రీలక్ష్మి మొవ్వ మండలానికి, మచిలీపట్నం ఎస్ఎస్ఏ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.రుక్మిణి మోపిదేవి మండలానికి, కొండూరు పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న భూక్యా కోటేశ్వరరావు కోడూరు మండలానికి, విజయవాడ యూత్ సర్వీసెస్ కార్యాలయంలో పనిచేస్తున్న కె.సంపత్‌కుమార్ బాపులపాడు మండలానికి కేటాయించారు. ఇక నుంచి వీరు డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతలు నిర్వర్తిస్తారు. గుడివాడ డిప్యూటీ ఎంపీడీవోగా జి.నరసింహారావు విధుల్లో చేరలేదు. రెండు రోజుల్లో చేరనున్నట్టు సమాచారం.

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు

అడుగులు

- 45 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు సర్వే ప్రారంభం
- డీపీఆర్ రూపకల్పన కోసం ఫీల్డ్ సర్వే
- వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు చేసే అవకాశం
- సమాంతరంగా రేపల్లె-బాపట్ల రైల్వేలైన్‌కు కూడా..
- కోల్‌కతా-చెన్నై మధ్య తగ్గనున్న ప్రయాణ దూరం
- బందరు పోర్టు నిర్మాణం నేపథ్యంలో కీలకం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ప్రాజెక్టుకు కీలక అడుగులు పడ్డాయి. బందరు పోర్టు నిర్మాణం నేపథ్యంలో రైల్వేలైన్ల అనుసంధానంలో భాగంగా మచిలీపట్నం-రేపల్లె లైన్ సర్వే కోసం రైల్వేబోర్డు నిధులు మంజూరు చేసింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ఫీల్డ్ సర్వే పనులు జరుగుతున్నాయి. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి ఫలితంగా మొత్తం 45.30 కిలోమీటర్ల మేర ఈ కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పార్లమెంట్‌లో ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా జరుగుతున్న పురోగతిని వివరించారు. రానున్న బడ్జెట్ నాటికి డీపీఆర్ పూర్తయితే 2026-27 వార్షిక బడ్జెట్‌లో ఈ కొత్త లైన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించే అవకాశం ఉంది.

దగ్గరి దారి

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు సంబంధించి తాజాగా సర్వే పనులు జరుగుతున్నాయి. ఈ రైలుమార్గం కోసం బందరు కేంద్రంగా గతంలో అనేక ఆందోళనలు జరిగాయి. కోల్‌కతా నుంచి చెన్నై వెళ్లాల్సిన రైళ్లన్నీ విజయవాడ రైల్వే జంక్షన్‌కు రావాల్సి వస్తోంది. దీనివల్ల విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ పెరుగుతోంది. అదే మచిలీపట్నం మీదుగా బాపట్ల చేరుకుని, అక్కడి నుంచి వెళ్తే కోల్‌కతా నుంచి చెన్నైకు మరింత దగ్గరగా ఉంటుంది. దాదాపు 60 కిలోమీటర్ల మేర దూరం తగ్గే అవకాశం ఉంటుంది. ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. ఇది సాకారం కావాలంటే మచిలీపట్నం-రేపల్లె నూతన రైల్వేలైన్ చాలా అవసరం. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎంపీ బాలశౌరి దీనిపై కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ స్థాయిలో తన వంతు ప్రయత్నాలు చేశారు. బందరు పోర్టుకు సరుకు రవాణాకు కీలకంగా మారుతుందని, కోల్‌కతా-చెన్నై మార్గంలో కూడా ఖర్చు తగ్గుతుందని రైల్వేమంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకొచ్చారు. వారు కూడా సానుకూలంగా స్పందించటంతో పాటు రైల్వేబోర్డుకు సిఫార్సు చేశారు. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలకు ఇది కోస్టల్ రైల్వే కారిడార్‌గా నిలుస్తుంది. నరసాపూర్-మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్లను కలుపుతుంది.

బాపట్ల-రేపల్లెకు మార్గం సుగమం

మచిలీపట్నం-రేపల్లె నూతన రైల్వేలైన్‌కు అనుసంధానంగా రేపల్లె-బాపట్ల రైల్వేలైన్‌కు కూడా సర్వే చేయాలని ఆదేశాలు అందాయి. రేపల్లె-బాపట్ల వరకు 46 కిలోమీటర్ల మేర నూతన రైల్వేలైన్‌కు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీనికి కూడా డీపీఆర్ రూపకల్పన కోసం క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరంగా జరుగుతోంది.

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ సాధించి తీరుతాం..

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ కోసం ఎంతో కృషి చేశాం. సర్వే పనులు జరుగుతున్నాయి. డీపీఆర్ కూడా పూర్తిచేస్తాం. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని భావిస్తున్నాం. ఏపీలో రైల్వే మౌలిక సదుపాయాల కోసం కేంద్రం రూ.9,417 కోట్లు ఖర్చు పెడుతోంది. బందరు పోర్టుకు సరుకుల ఎగుమతులు, దిగుమతులకు ఈ రైల్వేలైన్ ఎంతో దోహదపడుతుంది.

- వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడుతున్న ఎంపీ కేశిని చిన్ని



విజయవాడ-హైదరాబాద్ మధ్య బోయింగ్ వైడ్ బాడీ విమానాలు

- పది రోజుల్లో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు
- ఫలించిన ఎంపీ కేశినేని శివనాథ్ కృషి

వన్‌టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ విమానాశ్రయం నుంచి విజయవాడ-హైదరాబాద్ మధ్య వైడ్‌బాడీ విమానాలు అందుబాటులోకి తెచ్చేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన కృషి ఫలించింది. ఢిల్లీలోని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కార్యాలయంలో గురువారం ఇండిగో ఫ్లైట్ స్పెషల్ డైరెక్టర్ ఏకే సింగ్‌తో ఎంపీలు కేశినేని, జీఎం హరీశ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ-హైదరాబాద్ మధ్య ఏటీఆర్ విమానాల టికెట్ల వల్ల ప్రయాణికులపై పడే ఆర్థిక భారం, సీట్లు అందుబాటులో ఉండని విషయం, లగేజీ సమస్యలను వివరించారు. ఈ సమస్యలపై ఇండిగో ఫ్లైట్ స్పెషల్ డైరెక్టర్ ఏకే సింగ్ మాట్లాడుతూ వారం, పది రోజుల్లో విజయవాడ-హైదరాబాద్ మధ్య బోయింగ్ వైడ్-బాడీ విమాన సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ విమానాలు అందుబాటులోకి వస్తే టికెట్ ధర తగ్గటంతో పాటు సీట్లు అధికంగా అందుబాటులోకి మిగతా 6లో..

ఫ్లై ఓవర్

నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ రద్దు

- కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ తిరస్కరణ
- డీపీఆర్ పూర్తయినా కాలయాపన జరగడం వల్లే..
- మెట్రోరైల్ కారణంగా ఏపీఎంఆర్‌సీ కాలాతీతం
- పశ్చిమ బైపాస్ పూర్తికావడం కూడా ఓ సాకే..
- తిరిగి ప్రతిపాదనలు పంపుతామన్న ఎంపీ చిన్ని

> నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు జాతీయ రహదారుల సంస్థ మంగళం పాడేసింది. ఎన్‌హెచ్ విజయవాడ డివిజన్ అధికారులు పంపిన డీపీఆర్‌ను కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) తిరస్కరించింది. విజయవాడ వెస్ట్ బైపాస్ మరికొద్ది నెలల్లో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో నిడమానూరు ఫ్లై ఓవర్ అవసరం లేదని నిర్ణయించింది. ఈ కారణంగా ఆ ఫ్లై ఓవర్‌ను రద్దు చేసింది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు డీపీఆర్‌ను పంపడంలో జరిగిన జాప్యం, మెట్రోరైల్ కారిడార్‌తో లింకుపెట్టడం వంటి చర్యలు కాలాతీతానికి దారితీశాయి. ఈలోపు విజయవాడ వెస్ట్ బైపాస్ తుదిదశకు చేరుకోవడంతో మోర్త్ తన ఆలోచనను మార్చుకుని ఫ్లై ఓవర్‌ను రద్దు చేసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరానికి మంజూరైన నిడమానూరు ఫ్లైఓవర్ అతిపెద్దది. ఇప్పటి వరకు విజయవాడలో ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్, మిల్క్‌ఫ్యాక్టరీ, కనకదుర్గ, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ కంటే ఇదే పెద్దది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు 7 కిలోమీటర్ల పొడవునా ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్రం ఆమోదించింది. డీపీఆర్ కూడా పూర్తయింది. టెండర్లు పిలవాల్సిన దశలో మెట్రో రైలు ప్రాజెక్టు కారణంగా కాలాతీతం జరిగింది. మెట్రో కారిడార్‌కు ఇబ్బంది అవుతుందన్న దృష్ట్యా ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ నుంచి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ వేయాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలంటే రూ.1,000 కోట్లు అవుతుందని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) డీపీఆర్ తయారు చేయించి మోర్త్‌కు పంపించింది. ఏపీఎంఆర్‌సీ రూపొందించిన డీపీఆర్ ప్రకారం ఏడు కిలోమీటర్ల మేర సెంట్రల్ మీడియం ఫ్లై ఓవర్‌లో నిడమానూరు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.50 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. డీపీఆర్ తయారుచేయడం కోసం ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఐదు నెలల సమయం తీసుకుంది. ఈ సమయంలో విజయవాడ వెస్ట్ బైపాస్ తుదిదశకు చేరుకుంది. పశ్చిమ బైపాస్ ప్రారంభమైతే నిడమానూరు ఫ్లై ఓవర్ మిగతా 6లో..

కూచిపూడిలో మొలకెత్తిన ధాన్యం



ధాన్యానికి మొలకలు

- పరదాలు, టార్పాలిన్లు కప్పినా బస్తాల్లోకి చేరిన నీరు
- ముక్కిపోయి రంగుమారిన గింజలు
- నిండాముంచిన దిత్వా తుఫాను

6

భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

6

పాల ఉత్పత్తి వ్యయం తగ్గించడమే లక్ష్యం

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

8



దుర్గగుడి గిరిప్రదక్షిణలో ఈవో, ఆలయ అధికారులు

భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా గంగా, పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షణ నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీశారు. ఈవో వీకే శీనానాయక్, ఉప ప్రధాన అర్చకుడు శంకర శాండిల్య, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి తదితరులు బలిహరణలు సమర్పించారు. అనంతరం ఈవో, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, భక్తులు, తదితరులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా సాగింది. తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు.



గాయని సుశీలకు పురస్కారం అందజేస్తున్న కళాపీఠం సభ్యులు

గాయని పి.సుశీలకు కృష్ణమాచార్యులు కళాపీఠం పురస్కారం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బహుభాషా గాయని పి.సుశీలకు కృష్ణమాచార్యులు కళాపీఠం తరఫున 25వ వార్షిక పురస్కారం గురువారం చెన్నైలోని ఆమె నివాసంలో అందజేశారు. ఈ మేరకు కళాపీఠం అధ్యక్షురాలు పి.రంగనాయకి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతరంగంలో విశిష్ట సేవలు అందించిన కళాకారులకు ఏటా ఈ పురస్కారాన్ని ప్రకటించడం కళాపీఠం సంప్రదాయంగా కొనసాగిస్తోంది. 2025 సంవత్సరానికిగాను గాయని పి.సుశీలను పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా గాయని పి.సుశీల మాట్లాడుతూ, శాస్త్రీయ సంగీతాభివృద్ధికి కృష్ణమాచార్యులు చేసిన 'భగవత్ సేవ అమూల్యం' అని అభినందించారు. తనపై ప్రదర్శించిన గౌరవానికి కళాపీఠం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పురస్కార కార్యక్రమంలో కృష్ణమాచార్యులు కళాపీఠం కార్యదర్శి ఎన్‌సీహెచ్.బుచ్చయ్యాచార్యులు, వయోలిన్ విద్వాంసులు టీకేవీ రామానుజాచార్యులు, సంగీత రంగ ప్రముఖులు సీవీకే శాస్త్రి, ఎంసీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్‌తో ఆకాశవాణి సిబ్బంది

తెలుగుభాషకు దిక్సూచి ఆకాశవాణి

» మాజీ మేయర్ జంధ్యాల శంకర్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'ఆకాశవాణి' ప్రజల జీవన విధానంతో ముడిపడి వుందని, ఆకాశవాణి కార్యక్రమాలు తెలుగు భాష ప్రామాణికతకు దిక్సూచి అని విజయవాడ పూర్వ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. ఆకాశవాణి శ్రోతల మన్ననలు పొందేలా నేటి సమాజానికి అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేస్తుందని ఆకాశవాణి విజయవాడ కేంద్రం డీడీజీ, కార్యాలయ అధిపతి ఎం.సోమేశ్వరరావు అన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఏర్పాటు చేసి 77 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆకాశవాణి కేంద్రంలో 77వ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో తానా సంస్థ పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ జానపద కళాకారులకు 50 రేడియోలు బహూకరించారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో పనిచేసి, పదవీ విరమణ పొందిన 50 మంది కార్యక్రమ, ఇంజినీరింగ్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ, ఆకాశవాణి కార్యక్రమాలు ఇప్పటికీ, ఎప్పటికీ శ్రోతలు మన్ననలు పొందుతున్నాయన్నారు. ఆకాశవాణిలో సంగీతం, నాటకం, తెలుగు సాహిత్య, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలకు ప్రముఖ స్థానం వుందన్నారు. కార్యక్రమంలో ఆకాశవాణి డీడీజీ ఎం.సోమేశ్వరరావు, తానా సంస్థ పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, పూర్వ ఏడీజీ డాక్టర్ ఆర్‌పీ పద్మనాభరావు, ప్రముఖ సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎంసీ దాస్, హెన్రీ రాజు, చుండూరు మాణిక్యరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, డీవీ మోహనకృష్ణ పాటలు అలరించాయి.



విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శనలు

ఉర్రూతలూగించిన విద్యార్థుల నృత్యప్రదర్శనలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాతరంగ్ 2025 కార్యక్రమాల్లో భాగంగా వివిధ కళాశాలల విద్యార్థులు నిర్వహించిన నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. డా. వైఎస్ఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులో వివిధ కళాశాలల విద్యార్థుల జానపద నృత్యప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. పిబి సిద్ధార్థ, విజయవాడ దుర్గామల్లేశ్వరి, నలంద, లయోలా కళాశాలల విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఆడిటోరియం డప్పు వాయిద్యాలతో మారుమోగింది. ఒకరిపై ఒకరు పోటీపడుతూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకుల కేరింతల మధ్య నిర్వహించిన ఈ ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ ప్రదర్శనలు జరిగాయి. రవీంద్రనాథ్‌ఠాగూర్ సెమినార్ హాలులో సంగీత వాయిద్యాలతో విద్యార్థులు ప్రదర్శించారు. వీనుల విందుగా విద్యార్థులు దేశభక్తి గేయాలను వాయిద్య విశేషాలపై వినిపించారు. కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ బ్లాకులో క్విజ్ పోటీలు జరిగాయి. డా. బి.ఆర్ అంబేద్కర్ అకడమిక్ బ్లాకులో కార్టూన్ పోటీలు, క్లే మోడలింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు అనుభవజ్ఞులైన సీనియర్ నాట్యాచార్యులు, గాయకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



సాగునీటి కష్టాలకు కేరాఫ్..

» పుష్కలంగా నీరున్నా అన్నదాతకు తప్పని తిప్పలు!

» కృష్ణా సెంట్రల్ కమిటీ అత్యుత్సాహం రైతులకు శాపం

» స్పందించని పాలకులు, ప్రశ్నించని రైతు సంఘాలు

» ఆసరా లేక కలెక్టర్‌ను ఆశ్రయించిన అన్నదాతలు

» ఆర్థిక ఇబ్బందులున్నా సప్లయ్ చానళ్ల ఏర్పాటు

పులి-చింతల!

నిండు కుండలా పులిచింతల డ్యామ్

(ఆంధ్రజ్యోతి, నందిగామ)

పుష్కలంగా నీరున్నా పులిచింతల నుంచి నీరు విడుదల కాక ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని కృష్ణా పరీవాహక గ్రామాల్లో పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. వాటి ఆయకట్టులో వేలాది ఎకరాలభూమి సాగవుతుండగా దానిలో ఆహార, వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకాలు ఉన్నాయన్న ధీమాతో అన్నదాతలు భారీగా పెట్టుబడులు పెట్టి ముందుకుసాగుతున్నారు. మిర్చి, మాగాణి, మొక్కజొన్న, చెరకుపంటలకు నీటి అవసరం ఉన్న సమయంలో పులిచింతల నుంచి నీటి విడుదల నిలిపివేశారు. లీకుల రూపంలో కేవలం నాలుగువందల క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతోంది. దీంతో చందర్లపాడు మండలం ఉస్తేపల్లి, పొక్కునూరు, పున్నవల్లి, పోపూరు, చింతలపాడు, విపరింతలపాడు తదితర గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలకు నీరందని స్థితి నెలకొన్నది. ఆయా పథకాల ఆయకట్టులో దాదాపు పది వేల ఎకరాలకు పైబడి వాణిజ్య, తదితర పంటలు సాగవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ పంటలకు భారీగా పెట్టుబడులు పెట్టిన అన్నదాతకు సాగునీటి రూపంలో మరో విపత్తు ఎదురైంది. సాగునీటి విషయంలో ఏమాత్రం అశ్రద్ధ జరిగినా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. తడులు అందించడంలో కొద్దిపాటి జాప్యం జరిగినా దిగుబడులపై భారీ ప్రభావం చూపే ప్రమాదం ఉంది. దీనిపై ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేసి పులిచింతల నుంచి రెండు వేల క్యూసెక్కుల నీటిని మార్చి నెలాఖరు వరకైనా విడుదల చేయించాల్సి ఉంది.

ఇసుక తవ్వకాలతో మారిన దిశ..

కృష్ణానదిలో గుంటూరు జిల్లా వైపు పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరపడంతో పాటు భౌగోళికంగా కూడా అటువైపు పల్లంగా ఉంది. దీంతో పులిచింతల నుంచి కొద్దిపాటి నీరు విడుదలైన ప్రతిసారీ అటువైపునకు వెళుతున్నాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లా వైపు పాయకు చుక్కనీరు అందడం లేదు. దీంతో ఎత్తిపోతల పథకాల ఇన్‌టెక్ వెల్‌కు నీరు అందడం లేదు. సుమారు రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. తరచూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు సహకరించకపోయినా ఆవలఒడ్డున ఉన్న నీటి పాయను సప్లై చానల్స్ ఏర్పాటు చేసుకొని అపర భగీరథుల్లా నీటిని ఇటువైపునకు తెస్తున్నారు. సప్లై చానళ్ల ఏర్పాటుకు ఒక్కొక పథకం ఐదు నుంచి పది లక్షల వరకూ వెచ్చించాల్సి వస్తున్నది. దాదాపు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల మేర ఇసుకలో సప్లై చానల్స్ ఏర్పాటు చేసుకొని నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ సప్లై చానళ్లు నది వచ్చినప్పుడు పూడిపోతాయి కాబట్టి ఏటా ఆమేర పెట్టుబడులు పెట్టాల్సిందే. ఇంత చేసినా నదీ ప్రవాహం వేగంగా లేకపోతే సప్లై చానల్ ద్వారా నీరు ఇటు వైపు రావడం కష్టం. ప్రస్తుతం వస్తున్న కేవలం నాలుగు వందల క్యూసెక్కుల ప్రవాహం వల్ల సప్లై చానళ్లకు నీరు రావడం లేదు. దీంతో అన్నదాతలు ప్రభుత్వం వైపు చూస్తున్నారు. కనీసం రెండువేల కూసెక్కుల నీటిని నిరంతరాయంగా విడుదలచేసి పంటలు రక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నీరులేక కృష్ణానదిలో సప్లై చానల్ తీస్తున్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతులు



అతి జాగ్రత్త వల్లే ఈ పరిస్థితి

కృష్ణాడెల్టాకు సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని కృష్ణా సెంట్రల్ డివిజన్(కేసీ డివిజన్) పులిచింతల నుంచి నీటిని నిలిపివేసింది. పులిచింతల డ్యామ్ పూర్తి నిల్వ సామర్థ్యం 45 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి కొంతమేర వచ్చి చేరుతున్నట్టు సమాచారం. గతంలో ఇరవై టీఎంసీల నీరుఉండగా భవిష్యత్తు అవసరాల కోసం నీటిని నిల్వ ఉంచేవారు. గత ఏడాది కూడా అదే మేర నిల్వ ఉంచారు. వైసీపీ అధికారంలో ఉండగా, కేవలం 11 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచేవారు. అప్పట్లో ఈ ప్రాంత రైతుల అవసరాల నిమిత్తం టీడీపీ, వామపక్షాల రైతు సంఘాలు పలు పోరాటాలు చేశాయి. ప్రభుత్వంపైనా అధికారులపైనా తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి దిగువకు నీటిని విడుదల చేయించారు. కానీ ప్రస్తుతం 43 టీఎంసీలు ఉన్నప్పటికీ ఎవరూ నోరు మెదపడం లేదు. కనీసం ఇక్కడి ఎత్తిపోతల పథకాల ఆయకట్టు అవసరాలను కేసీ డివిజన్ అధికారులకుగానీ, ప్రభుత్వ పెద్దలకుగానీ తెలియజేయడం లేదు. సమాచారం లేక ప్రభుత్వం స్పందించడం లేదు. సాగునీటి కోసం ఆందోళన చెందుతున్న అన్నదాతలు మాత్రం ప్రభుత్వం స్పందించడం లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పులిచింతల నుంచి మార్చి, ఏప్రిల్ మాసాల వరకూ రెండువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయించాల్సి ఉంది. ఇప్పటికే పొక్కునూరు తదితర ఎత్తిపోతల పథకాల రైతులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలసి వినతి పత్రం అందజేశారు. కృష్ణా సెంట్రల్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని కలెక్టర్ చెప్పినట్లు రైతులు తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా స్పందించి విషయాన్ని జలవనరుల శాఖా మంత్రికి, అవసరమైతే ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసి అన్నదాతలను ఆదుకోవాల్సి ఉంది.



నదీ ప్రవాహం లేకపోవడంతో ముందుకు సాగని నీరు



నీరందక నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

శబరిమలకు ప్రత్యేక రైళ్లు, కొన్ని పొడిగింపు

రైల్వేస్టేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శబరిమల యాత్రికుల రద్దీని పురస్కరించుకుని సౌత్‌సెంట్రల్ రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లను మరికొంతకాలం పాటు పొడిగించినట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎ మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07125 నరసాపూర్ - కొల్లం (శనివారం) బయలుదేరుతుంది. ఈనెల 27న ఒక సర్వీసు మాత్రమే నడుస్తుంది. 07127 చర్లపల్లి-కొల్లం జనవరి 10, 17న (శనివారం) నడుస్తుంది. 07126 కొల్లం-చర్లపల్లి (సోమ)ఈనెల 29న నడుస్తుంది. 07128 కొల్లం-చర్లపల్లి (సోమ) జనవరి 12, 19న రెండు సర్వీసులు నడుస్తుంది.

కొనసాగుతున్న పొడిగింపు..

07117 సిరిపూర్ కాగజ్‌నగర్ - కొల్లం శనివారాలలో నడుస్తుంది. ఈనెల 3వ తేదీ ఒక సర్వీసుగా నడుస్తుంది. 07118 కొల్లం - చర్లపల్లి సోమవారాలలో బయలుదేరుతుంది. జనవరి 5న ఒక సర్వీసుగా నడుస్తుంది. ఈ రైళ్లకు ప్రస్తుతం ఉన్న షెడ్యూలే వర్తిస్తుంది.

కొండవీడు ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పు

యశ్వంతపూర్-మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్ 17212కు జనవరి 1 నుంచి సమయాలలో మార్పులు చేసినట్టు డివిజన్ పిఆర్వో ఓ ప్రకటనలో తెలిపారు. సవరించిన సమయాలు ఇలా ఉన్నాయి. యశ్వంతపూర్‌లో మధ్యాహ్నం 1.15కి బదులుగా 12.45 గంటలకు బయలుదేరుతుంది. విజయవాడ అర్ధరాత్రి 2.50కు, గుడివాడ వేకువజామున 3.48కి, మచిలీపట్నం 5.15కు చేరుతుంది.

13 రైళ్లకు ఓటీపీ ఆధారిత తత్కాల్ బుకింగ్ సౌకర్యం

సౌత్ సెంట్రల్ రైల్వేలోని 13 రైళ్లలో రిజర్వేషన్‌కు ఓటీపీ ఆధారిత తత్కాల్ బుకింగ్‌ను అమలు చేస్తున్నారు. ప్రయాణికులు తాము తత్కాల్ టిక్కెట్లను బుక్ చేసుకునే సమయంలో ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ లింక్ చేసిన మొబైల్ నెంబర్లకు ఓటీపీ వస్తుంది. 12016 హైదరాబాద్-పూణే శతాబ్ది ఎక్స్‌ప్రెస్, 12220 సికింద్రాబాద్-ముంబయి లోకమాన్య తిలక్ టెర్మినల్ దురంతో ఎక్స్‌ప్రెస్, 12285 సికింద్రాబాద్-హజరత్ నిజాముద్దీన్ దురంతో ఎక్స్‌ప్రెస్, 12437 సికింద్రాబాద్-హజరత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్, 20102 సికింద్రాబాద్-నాగపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20678 విజయవాడ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20701 సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 20702 తిరుపతి-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, 20703 కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్‌ఎక్స్‌ప్రెస్, 20705 హెచ్ఎస్ నాందేడ్-ముంబయి సిఎస్ఎంటి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20707 సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 20834 సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 22204 సికింద్రాబాద్-విశాఖపట్నం దురంతో ఎక్స్‌ప్రెస్‌లో ఓటీపీ విధానం అమలవుతుంది.

డీడీవోలతో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం

» కార్యాలయాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి డివిజనల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలు ఎంతగానో తోడ్పడతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పేర్కొన్నారు. మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామ సచివాలయ పైభాగంలో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంజీఎన్ఆర్ఇజీఎస్ అదనపు కమిషనర్ శివప్రసాద్‌లతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలు, వారికి సంబంధించిన వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి రాకుండా డివిజనల్ స్థాయిలో అభివృద్ధి అధికారి కార్యాలయాల వద్దకు రావాలన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై డివిజనల్ స్థాయిలో డివిజనల్ అభివృద్ధి అధికారులు సజావుగా పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజలకు మెరుగైనసేవలు అందించే విధంగా పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఆక్వా కల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకే నారాయణ ప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, డీఎల్‌డీవో జి.పద్మ, డీఎల్‌పీవో రజావుల్లా, ఎండీవో వెంకటేష్, తహసీల్దార్ నాగభూషణం, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మచిలీపట్నం మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోతేపల్లిలో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కూచిపూడిలో ఆరబెట్టిన రంగుమారిన ధాన్యం

ధాన్యానికి మొలకలు

కూచిపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికందివచ్చే తరుణంలో దిత్వా తుపాను రైతులను నిండా ముంచింది. దీని ప్రభావంతో ధాన్యం రంగుమారి మొలకలు వస్తున్నాయి. గత శని, ఆదివారాల్లో తేమశాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని కాటాలు వేసి నెట్లు కట్టుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మూడు రోజుల పాటు కురిసిన వర్షాలతో ధాన్యం బస్తాలపై పరదాలు, టార్పాలిన్లు కప్పుకున్నా ఫలితం లేకుండా పోయింది. ధాన్యం బస్తాల్లోకి వర్షపు నీరు వెళ్లి మొక్క మొలవగా, తేమశాతం అధికంగా ఉండటంతో ధాన్యం ముక్కిపోయి రంగుమారింది. ఈ దశల్లో గురువారం వేసిన ఎండలో రైతులు బస్తాల్లో ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. కూచిపూడి గ్రామానికి చెందిన కౌలురైతులు వెలగం సాంబశివరావు, నాగరాజులకు చెందిన 20 ఎకరాల్లో ధాన్యం ఈ విధంగా తయారైంది. ఈ పరిస్థితి దరిదాపుగా మండలంలోని అన్ని గ్రామాల్లో చోటు చేసుకుంది. రంగుమారిన, మానుగాయివచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నా, అవి ఆచరణలో మాత్రం అమలు కావటం లేదని రైతులు వాపోతున్నారు. గత అక్టోబరు నెలాఖరున వచ్చిన మొంథా తుఫాను రైతులను ఒకరకంగా నష్టపరిస్తే, గత నవంబరు నెలాఖరుకు వచ్చిన దిత్వా తుఫాను రైతులను కోలుకోలేని దెబ్బతీసి, నష్టాల ఊబిలోకి నెట్టిందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

విలువైన సమయం వృథా చేయొద్దు

(5వ పేజీ తరువాయి)

దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు. చట్ట సభల్లో ఆయన మాట్లాడిన తీరు ఎంతో హుందాగా ఉంటుందని గుర్తు చేశారు. జిల్లాకు ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు భాషలోనే పాలనాపరమైన ప్రత్యుత్తరాలు జరగాలని ఆకాంక్షించారు. అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కృష్ణా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చేసిన కృషి, జిల్లా చరిత్ర, తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వీసీ కూన రాంజీ, రిజిస్ట్రార్ ఉష, రెక్టార్ బసవేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ దిలీప్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్

(5వ పేజీ తరువాయి)

అవసరం లేదని మోర్త్ భావించడంతో ఎన్నాళ్లనుంచో ఎదురుచూస్తున్న నిడమానూరు ఫ్లై ఓవర్ కల చెదిరింది.

మళ్లీ ప్రతిపాదనలకు ఎంపీ చిన్ని ప్రయత్నాలు

నిడమానూరు ఫ్లై ఓవర్ ప్రతిపాదన మళ్లీ చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నిర్ణయించారు. వెస్ట్ బైపాస్ వచ్చినప్పటికీ.. నగరంలో ఉన్న అంతర్గత ట్రాఫిక్ సమస్య అంతా ఇంతా కాదు. మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు దాదాపు పెద్దవి, చిన్నవి కలిపి 12 జంక్షన్లు ఉన్నాయి. ఈ కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా నిలిచిపోతోంది. నిడమానూరు నుంచి నగరంలోకి చేరుకోవాలంటే అరగంట, ఒక్కోసారి గంట వరకు సమయం పడుతోంది. ఇదే మార్గంలో జవహర్ ఆటోనగర్, కానూరు ఆటోనగర్ ఉన్నాయి. ఈ ఆటోనగర్‌లలోకి భారీ వాహనాలు చేరుకోవాలంటే ఎన్‌హెచ్-16 మీదుగా నిర్దేశించిన నాలుగు మార్గాల్లో రాకపోకలు సాగించాలి. ఈ కారణంగా కూడా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోతోంది. విజయవాడకు ఈస్ట్ బైపాస్ ప్రతిపాదన కూడా రద్దైంది. అటు వెళ్లాల్సిన ట్రాఫిక్ కూడా విజయవాడ మీదుగానే వెళ్తోంది. దీంతో పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వచ్చినప్పటికీ కూడా విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య ఏమాత్రం తగ్గదని విజయవాడ ఎంపీ భావిస్తున్నారు. ఈ కారణంగా నిడమానూరు ఫ్లైఓవర్‌ను తిరిగి సాకారం చేసుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరోమారు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖతో చర్చించాలని భావిస్తున్నారు.

విజయవాడ-హైదరాబాద్ బోయింగ్ వైడ్-బాడీ విమానాలు

(5వ పేజీ తరువాయి)

వస్తాయని వివరించారు. లగేజీ సమస్య కూడా పరిష్కారం అవుతుందన్నారు. ఎంపీ శివనాథ్ కోరిన విధంగా విజయవాడ నుంచి వారణాసి, అహ్మదాబాద్, పుణె, కొచ్చిన్, గోవా విమాన సర్వీసులు నడిపించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆధ్యాత్మిక ప్రాంతాలైన వారణాసి, కొచ్చిన్ మధ్య విమాన సర్వీసులు త్వరగా ప్రారంభించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా కోరారు. తమ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించేందుకు కృషిచేసిన కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

కనుల పండువగా కనకదుర్గమ్మ కలశ జ్యోతి ఊరేగింపు



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భవానీ, భావనాగమ్యా, భవారణ్య కుఠారికా భద్రప్రియా, భద్రమూర్తిః, భక్తసౌభాగ్య దాయినీ.. అని లలితా సహస్ర నామంలో కీర్తించిన రీతిగా భవుడైన శివుని సతీమణి భవానీ. ఆ భవానీని ధ్యానిస్తూ, కీర్తిస్తూ, పూజిస్తూ చేసే దీక్షే భవానీ దీక్ష. ఇంద్రకీలాద్రి పై కొలువున్న దుర్గ అమ్మవారిని నియమబద్ధ దీక్షతో పూజించి, అమ్మ అనుగ్రహం పొందటానికి కంచి కామకోటి పీఠాధిపతి ఆదేశానుసారం 1981 నుండి భవానీ దీక్షలు ప్రారంభం కాగా, అందుకు విశేష కార్యక్రమంగా మొదటిసారి కలశ జ్యోతి ఊరేగింపు ప్రారంభం అయింది. గురువారం నిర్వహించిన కలశజ్యోతి ఊరేగింపు 44వదని ఆలయ పండితులు పేర్కొన్నారు.

వేటుకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

దౌర్జన్యానికి సైతం దిగారు. 69 పనుల్లో అప్పటి అసిస్టెంట్ కమిషనర్ టి.రంగారావుకు చెందిన బినామీ కాంట్రాక్టర్‌ల బిల్లులే అధికంగా ఉన్నాయని ఆరోపణలు వెలువెత్తాయి.

కంటిన్‌జెంట్ పనుల పేరుతో భారీగా దోపిడీ

పురపాలక సంఘ పరిధిలో కేవలం నోటి మాటతో రూ.లక్ష లోపు విలువ గల పనులను చేపట్టారు. ఎటువంటి టెండర్ ప్రకటన, నియమాలు, అగ్రిమెంట్‌లు లేకుండా 69 పనులను చేపట్టినట్టు చూపి రూ.54.97 లక్షల బిల్లులను పెట్టారు. అప్పట్లో మున్సిపాల్టీలో చక్రం తిప్పిన అధికార పార్టీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, కొందరు మున్సిపల్ ఉద్యోగులు మిలాఖత్ అయ్యి, అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న ముగ్గురు కాంట్రాక్టర్‌ల సహాయంతో మున్సిపల్ నిధులను కొల్లగొట్టారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కరోనా విపత్తు కాలంలో రూ.2 కోట్ల మేర ఈ విధంగా గుట్టుచప్పుడు కాకుండా బొక్కేశారని కాంట్రాక్టర్ వర్గాలు కోడైకూస్తున్నాయి. కంటిన్‌జెంట్ అంటే నామమాత్రంగా చిన్న కాగితం ముక్కపై పనులు చేశామని పేర్కొంటూ మున్సిపల్ కమిషనర్ అనుమతితో జనరల్ ఫండ్ నుంచి బిల్లులు చెల్లిస్తారు. ఆ తర్వాత సదరు కాగితపు ముక్కను చించేసినా, పారేసినా అడిగే దిక్కే లేదు. ఏ ఒక్క అధికారి దీనికి సమాధానం చెప్పరు. అందుకే ఈ రకంగా బిల్లులతో పనులు చేపడితే ఆడిట్‌లో కూడా దొరికే ఛాన్స్ లేదని కాంట్రాక్టర్లు బహిరంగంగా చెబుతున్నారు.

క్రమశిక్షణా చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులు

రూ.54.97 లక్షల కంటిన్‌జెంట్ బిల్లుల వ్యవహారంలో అప్పటి మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, రాజమండ్రి వారి నివేదిక, మున్సిపల్ డీఎంఏ సిఫారసు మేరకు కూటమి ప్రభుత్వం అప్పటి 19 మంది మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. వీరిలో విశ్రాంత మున్సిపల్ కమిషనర్ పి.జె.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్, ప్రస్తుత మండపేట మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శేఖర్ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విశాఖపట్నం), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కరుణాకర్ (విజయవాడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), పి.ఆర్.సి.ప్రవీణ్‌కుమార్ (మచిలీపట్నం), విశ్రాంత డీఈఈ టి.వి.రాజు, అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఎం.డి.ఎస్.ఎస్.రత్న(కృష్ణా వర్సిటీ ఆర్థిక అధికారి), అసిస్టెంట్ ఇంజినీర్లు జ్వాల దీప్తి, తేజస్వి (అసిస్టెంట్ ఇంజినీర్లు, మచిలీపట్నం), విశ్రాంత ఏఈ ప్రభాకర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎల్.ఎస్.అప్పారావు, డి.ఆదినారాయణ(పెద్దాపురం శానిటరీ ఇన్స్‌పెక్టర్), ఎ.రాంబాబు (చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్), బి.పి.కె.వి.ఎస్.సుబ్రహ్మణ్యం (హెల్త్ అసిస్టెంట్, తాడిగడప), ఆర్.నరేష్, టౌన్ ప్లానర్ పి.నాగేంద్ర(రిటైర్డ్), అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.రాంబాబు (విజయవాడ అసిస్టెంట్ సిటీ ప్లానర్), సీనియర్ అసిస్టెంట్ కె.చెన్నకేశవరావు (సీనియర్ అసిస్టెంట్, ఉయ్యూరు), సీనియర్ అకౌంటెంట్ ఆర్.జోజి ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

స్కూల్ గేమ్స్ జాతీయ పోటీలకు నున్న విద్యార్థులు



విజయవాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ జాతీయ పోటీలకు నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 13 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.రవి ప్రసాద్ తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ పోటీల్లోనూ సత్తా చాటాలని ప్రిన్సిపాల్ సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు టి. శ్రీలత, టి.విజయవర్మ పాల్గొన్నారు







డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కానూరులో డ్రెయిన్ల పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకు డీడీవో కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంట సచివాలయ ప్రాంగణంలో డివిజినల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వ పని తీరుకు అద్దం పట్టేలా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో ఏడు మండలాల్లోని 124 పంచాయతీలు, 122 సచివాలయాలు, రెండు మున్సిపాలిటీలకు డీడీవో కార్యాలయం ప్రధానంగా పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా ఆయా పంచాయతీలు, సచివాలయాల్లో ఇబ్బంది అనిపించినా డీడీవో కార్యాలయంలో పరిష్కారం లభిస్తుందన్నారు. డీపీవో జె.అరుణ, డీఎల్‌డీవో రాజేశ్, ఎంపీడీవోలు శేషగిరిరావు, సీతారామారాజు, రవికాంత్, జ్యోతి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన పవన్‌కల్యాణ్

ప్రసాదంపాడు : ప్రసాదంపాడులోని మూడో సచివాలయంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. చిత్తూరు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

కానూరు: కానూరులోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో పూడికతీత పనులను గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరిశీలించారు.సనత్‌నగర్ పంటకాలువ రోడ్డు మేజర్ డ్రెయిన్ కల్వర్ట్, చెక్‌పోస్టు టెర్మినల్ రోడ్డు, తులసీనగర్ ఐదో రోడ్డులో డ్రెయిజీలో పూడికతీతపనులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తిచేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, అసిస్టెంట్ కమిషనర్ డి. కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్ల

అవకాశాలు సృష్టించుకొని సేవలందిస్తేనే గుర్తింపు

పెనమలూరు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : అవకాశాలను సృష్టించుకొని ప్రజల్లోకి దూసుకెళ్లి సేవ చేసే వాడే నిజమయిన నాయకుడని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్ల అన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో డాక్టర్ వర్ల మాట్లాడారు. మంచి నాయకుల వల్లనే రాష్ట్రాలు, ప్రాంతాలు బాగుపడతాయన్నారు. నాయకత్వ లోపం వల్ల సమాజం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అధిక సంఖ్యలో నాయకులు ఉన్న ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని డాక్టర్ వర్ల అన్నారు. ప్రజలతో నిత్యం, నిరంతరం మమేకమయ్యే నాయకులు ప్రస్తుత సమాజంలో అత్యంత అవసరమన్నారు. రాజీపడ్డ వాడే రాజని..ప్రజలకు సేవచేయడంలో ఓర్పు వహించి ప్రజల అభిరుచులకు అనుగుణంగా పని చేసే వాడే నిజమయిన పాలకుడన్నారు. ప్రజలలో సానుకూల వాతావరణం కల్పించి, ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గమనించి తీర్చగలిగిన రోజు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలకు మర్యాద, ప్రాముఖ్యత ఇవ్వడం, మంచి పనులు చేసినప్పుడు వారిని మెచ్చుకోవడం లాంటి చర్యల ద్వారా వారి మనసును గెలుచుకోవచ్చన్నారు. సమాజంలో ప్రతి మనిషి గుర్తింపు కోసం తపించేవాడేనని, అది గమనించి పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాజీవితంలో, రాజకీయ రంగంలో ఉండే వారు ప్రజలకు మరింత సన్నిహితం అయ్యేట్లు వారిని వారే మలచుకోవాలని సూచించారు. నాయకులు, పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోశయ్యకు ఘననివాళి

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నేటి తరం రాజకీయ నాయకులకు మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య జీవితం ఆదర్శనీయమని బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం నేతలు పేర్కొన్నారు. రోశయ్య వర్ధంతిని ఏలూరు రోడ్డులోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నేతలు కొనకళ్ల రాజశేఖర్, కాశీ వరప్రసాద్,రూపాశంకర్, చామర్తి రాంబాబు, మిట్టపల్లి పద్మలలిత, నారికమల్లి ప్రసాద్ వెచ్చా వెంకటేశ్వరరావు, అయితా శ్రీనివాసరావు, లోకనాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



ప్రసాదంపాడులో సిమెంటు రహదారిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గ్రామాల రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు.

ప్రసాదంపాడులో రూ.90 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రహదారులను గురువారం యార్లగడ్డ ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ నిధు లు రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. యార్లగడ్డ మాట్లాడుతూ, వైసీపీ హయాంలో అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు.గ్రామల్లోని అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

అనంతరం స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే వెంకట్రావు దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ సర్నాల గంగారత్నం, ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, టీడీపీ నాయకులు సర్నాల బాలాజీ, కోనేరు నాని, బొప్పన హరికృష్ణ, పోలిశెట్టి రమణ, పరుచూరి నరేష్, కొలకలూరి కుమాంర్, జనసేన నాయకులు అల్లిన మహేష్, బీజేపీ నాయకులు ఫణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



సామాగ్రి అందజేస్తున్న పూర్ణచంద్రరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు వెలమర్తి రవిబాబు అన్నారు. రేమల్లె ఎంపీపీ మోడల్ స్కూల్‌కు అవసరమైన రూ.10 వేల విలువ గల సామాగ్రిని తుమ్మల పూర్ణచంద్రరావు గురువారం హెచ్‌ఎంకు అందజేశారు. ఫ్యాన్లు, మోటారు అందజేశారు. విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నటరాజ్, దేవదాస్, సాయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నున్నలో భారీ వృక్షాలు నరికివేత..స్థానికుల ఆగ్రహం



లైబ్రరీ సెంటర్‌లో నరికేసిన వృక్షాలు

విజయవాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామంలో దశాబ్దాల నాటి పచ్చని భారీ వృక్షాలను గురువారం కొందరు ప్రైవేటు వ్యక్తులు నరికివేశారు. అకారణంగా భారీ వృక్షాలను నరికివేయడంపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గీతా మందిర్, లైబ్రరీ సెంటర్‌లో దశాబ్దాలు భారీ వృక్షాలు ఉన్నాయి. స్థానికులు అనేక మంది చెట్ల కింద సేద తీరుతూ ఉంటారు. ఈ క్రమంలో గురువారం కొందరు ప్రైవేటు వ్యక్తులు చెట్ల కొమ్మలను నరికి వేశారు. స్థానికులు వారిస్తుండగానే భారీ యంత్రాల సాయంతో వృక్షాలను మొదళ్లతో సహా నరికివేశారు. స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అప్పటికే చాలా వృక్షాలు నెలకొరిగాయి. నీడనిచ్చే చెట్లను నరికి వేయడంపై స్థానికుల నుంచి పంచాయతీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సైడు కాల్వలు దెబ్బతింటుండంతో చెట్లు తొలగిస్తున్నట్లు చెట్లు నరికేందుకు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు చెప్పారు. ఈ విషయమై పంచాయతీ ఈవో ను వివరణ కోరగా తాను మూడు రోజులుగా ఊళ్లో లేనని, కాలువ ధ్వంసమైందని కొందరు చెప్పడంతో పెరిగిన కొమ్మలను తొలగించాలని సూచించినట్లు చెప్పారు. భారీ వృక్షాలు తొలగించిన విషయమై విచారిస్తామని చెప్పారు.

తిప్పనగుంట వాసికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఆదు కుంటోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొం దుతు న్న తిప్పనగుంటకు చెందిన ముర్రాల ప్రవీణ్‌కు రూ.3 లక్షల మంజురుకు సంబంధించిన ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే యార్లగడ్డ అందజేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ పాల సొసైటీ అధ్యక్షుడు బుద్దాల రంగారావు, కొడాలి చిట్టిబాబు, వేమూరి నవీన్ పాల్గొన్నారు.



సిమెంట్ బల్లలతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

మానవతా 23 సిమెంట్ బెంచీలు వితరణ

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో 23 సిమెంట్ బెంచీలను దాతల సహాయంతో గన్నవరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. ఒక్కోటి రూ.6500 విలువతో మొత్తం రూ.1.50 లక్షలతో బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, కర్రా వరప్రసాద్, వీసం ప్రసాదరావు, ముక్కామల సుబ్బారావు, గన్నె వెంకట్రావు, పువ్వుల ఆదినారాయణ, కనకాల వెంకటేశ్వరరావు, సయ్యద్ లాల్, వీవీ కృష్ణమోహన్, పొట్లూరి రామకృష్ణారావు, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.



దత్తాత్రేయ జయంతి

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గండిగుంట దత్తాశ్రమంలో శుక్రవారం దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. పంచామృత అభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం 108 కలశాలతో కలశాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. హోమం, పూర్ణాహుతి చేసి 400 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై సురేశ్‌బాబు

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండి కష్టపడి విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉయ్యూరు రూరల్ ఎస్సై కె.సురేశ్ కుమార్ అన్నారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూరల్ పోలీస్, డి-అడిక్షన్ సెంటర్, ఫ్రీడం ఫౌండేషన్ రిహేబిలిటేషన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో కార్యక్రమం ప్రారంభించి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం.. సమాజంలో గౌరవంగా బతుకుదాం అని అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యా లు, మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితం సర్వనాశనం అవుతుందని కంకి సీఐ మురళీకృష్ణ అన్నారు. ఈగల్ క్లబ్స్, రిహేబిలిటేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెడనలో పైడమ్మ జాతర ప్రారంభం

పెడన/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావులు ఉత్సవాలు ప్రారంభించారు. ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. మచిలీపట్నంలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి వద్ద రంగుల అలంకరణ పూర్తి చేసుకుని గురువారం ఉదయం ఊరేగింపుగా పైడమ్మ పెడన బయలుదేరారు. ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి లక్ష్మీనరసింహారావు, సభ్యురాలు జొన్నలగడ్డ మాధవి, అర్చకుడు లీలాప్రసాద్ తదితరులు లలితా సహస్ర పారాయణ చేసి అమ్మవారికి సారె సమర్పించి సాగనంపారు.

సిద్ధార్థలో నౌకాదళ దినోత్సవం

కానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం భారత నౌకాదళ దినోత్సవం-2025 నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారత నౌకాదళ సిబ్బంది పాల్గొని ధైర్యంతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శివరాంప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ 13న

గన్నవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ ఎస్.అరుణశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

అయ్యప్ప దీక్షతో క్రమశిక్షణ

ఉయ్యూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షతో క్రమశిక్షణ, అధ్యాత్మికత అలవడతాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్‌తో పాటు పలువురు దీక్ష చేపట్టి గురువారం గండిగుంట అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఇరుముడులు గురువారం కట్టించుకున్నారు. శబరిమల వెళుతున్న సందర్భంగా రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. గురుస్వామి వీరంకి చింతయ్య, రాజులపాటి వెంకట నరసింహారావు, శంకర్, చేదుర్తిపాటి ప్రవీణ్, అజ్మతుల్లా తదితరులు పాల్గొని మాలధారణలో




వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కృష్ణా వర్సిటీకి వెంకయ్య నాయుడు రాక

● స్వాగతం పలికిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణాతరంగ్ 2025 ప్రారంభోత్సవానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు బందరు మండలం రుద్రవరం కృష్ణా విశ్వవిద్యాలయానికి వచ్చిన సందర్భంగా గురువారం ఉదయం ఆయనకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్, బీజేపీ నేతలు సోడిశెట్టి బాలాజీ, పంతం గజేంద్ర, కృష్ణావర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ, రిజిస్ట్రార్ ఎన్.ఉష, రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, కృష్ణాతరంగ్ కన్వీనర్ ఆచార్య దిలీప్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణప్రసాద్, బందరు డీఎస్పీ సీహెచ్‌రాజా స్వాగతం పలికారు. వెంకయ్యనాయుడును మంత్రి రవీంద్ర పుష్పగుచ్ఛంతో స్వాగతం పలకగా, ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. అనంతరం వెంకయ్యనాయుడు బెలూన్లు ఎగురవేసి కృష్ణా తరంగ్ 2025ను లాంఛనంగా ప్రారంభించారు.

నేటి నుంచి సిద్ధార్థలో నేషనల్ లీగల్ ఫెస్ట్

కానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాలలో ఈనెల 5 నుంచి 7 వరకు జస్టిస్ చల్లా కొండయ్య మెమోరియల్ సిద్ధార్థ 4వ నేషనల్ లీగల్ ఫెస్ట్-2025 నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాల సెమినార్ హాలు వేదికగా ఉత్సవ ప్రారంభం జరుగుతుందని, ముఖ్యఅతిథులుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు పాల్గొంటారన్నారు. గౌరవ అతిథులుగా సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రాజయ్య, పి లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ పి ప్రభాస్ పాల్గొంటారన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్ర, జాతీయ న్యాయ కళాశాలల నుంచి 100 మంది వరకు విద్యార్థులు హాజరవుతారని డాక్టర్ దివాకర్‌బాబు తెలిపారు.



నగరంలో శంబాల సందడి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో శంబాల చిత్ర బృందం సందడి చేసింది. ఏ మిస్టికల్ వరల్డ్ ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్ నేపథ్యంలో తీసిన ఈ చిత్రం డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుందని హీరో ఆది తెలిపారు. స్టెల్లా కళాశాల సమీపంలోని ఏ సిటీ ఫైబర్ నెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో ఆది మాట్లాడుతూ శంబాల ఒక మిస్టరీ థ్రిల్లర్‌గా ఉండి, 1980లో ఒక గ్రామంలో ఉల్కాపాతం తర్వాత జరిగే అతీంద్రీయ సంఘటనల చుట్టూ తిరుగుతుందన్నారు. దర్శకుడు యుగంధర్ ముని చెప్పిన కథ నచ్చిందన్నారు. సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకొంటుందన్నారు. హీరోయిన్ అర్చన పాత్ర సినిమాకు హైలెట్‌గా ఉంటుందన్నారు. నటుడు ఇంద్రనీల్, నటుడు మాట్లాడుతూ డిసెంబరు 25న విడుదలయ్యే ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.


సిద్ధార్థ మెడికల్ కాలేజీ బృందంతో డబ్ల్యూహెచ్‌వో, డబ్ల్యూడీఎఫ్ బృందం

ఎస్ఎంసీని సందర్శించిన డబ్ల్యూహెచ్‌వో బృందం

విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ (ఎస్ఎంసీ)ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), వరల్డ్ డయాబెటిస్ ఫౌండేషన్ (డబ్ల్యూడీఎఫ్) నిపుణుల బృందం గురువారం సందర్శించింది. జెనీవా నుంచి వచ్చిన ఈ నిపుణుల బృందం కాలేజీలోని ప్రీవెంటివ్ అంకాలజీ యూనిట్ (పీఓయూ)ను పరిశీలించి యూనిట్‌లో కేన్సర్ స్ర్కీనింగ్‌కు అనుసరిస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, ప్రొటోకాల్స్‌పై కాలేజీ అధ్యాపకులతో చర్చించింది. జెనీవా నుంచి వచ్చిన బృందం అంకాలజీ విభాగంలో అనుసరిస్తున్న విధానాలపై ప్రశంసలు కురిపించింది. జెనీవాలో త్వరలో జరగనున్న సమావేశంలో అంకాలజీ విభాగంలో అనుసరిస్తున్న ఉత్తమమోడల్, ప్రొటోకాల్స్‌ను ప్రదర్శించబోతున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఏడుకొండల రావు తెలిపారు.

బందరు ఎస్ఈ సత్యానందానికి సీజీఎంగా పదోన్నతి



విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో బందరు ఎస్ఈగా విధులు నిర్వహించిన సత్యానందానికి సీజీఎంగా ప్రమోషన్ వచ్చింది. విజయవాడ కార్పొరేట్ ఆఫీసులో చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జేఏవోలు గుడే టి దీపక్, గద్దల స్టాలిన్‌బాబు, సబ్‌ఇంజనీర్ యూ సురేష్‌కుమార్ గురువారం సీజీఎం సదానందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం.. రూ.3.50 కోట్లు నష్టం



తిరువూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధిత ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో పైపులు పగిలి రూ.3.50 కోట్లు నష్టం జరిగిందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎంపీపీ గద్దల భారతి అ ధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఆంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎక్కడో విద్యుత్ తీగలు కలవడం వల్ల వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన స్పందించడం లేదన్నారు. జడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనుల సమాచారం ఇవ్వడం లేదని, గతంలో రైతుభరోసా పథకంలో నగదు పడ్డ రైతులకు నేటి అన్నదాత సుఖీభవ పథకం నగదు జమకావడం లేదన్నారు. తహసీల్దార్ నాగమణి, ఏవో పద్మ వివరణ ఇస్తూ కొన్ని గ్రామాల్లో రీసర్వేలో జాప్యం వల్ల రైతుల పేర్లు నమోదు కాలేదని, ప్రస్తుతం వారి జాబితా రూపొందించి తదుపరి నగదు పూర్తిగా అందుతుందన్నారు. ఎంపీడీవో సీహెచ్ రవిబాబు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పచ్చటి పందిరి రోడ్లు

● పచ్చని చెట్లు వెంటుంటే హాయిగా సాగదా ప్రయాణం

● విజయవాడ - విస్సన్నపేట రహదారిపై వెల్లటూరు - కోడూరు మధ్య అద్భుత దృశ్యం

● రోడ్డుకు పందిరేసిన చెట్లు.. అర కిలోమీటరు మేర పచ్చదనం

● కాలుష్యం లేకుండా స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తున్న ప్రయాణికులు

● రోడ్లన్నీ ఇలా ఉంటే టెన్షన్స్ ఉండవు.. ప్రమాదాలూ జరగవు


వెల్లటూరు - కోడూరు గ్రామాల మధ్యలో వీవీ రోడ్డుపై రహదారికిరువైపులా చెట్లు వేసిన పందిరి నీడలో చల్లగా సాగుతున్న ప్రయాణం

అది విజయవాడ - విస్సన్నపేట రోడ్డు. వెల్లటూరు - కోడూరు గ్రామాల మధ్యన అద్భుత ప్రకృతి దృశ్యం మదిని పరవశింపజేస్తోంది. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు పందిరిలా కమ్మేశాయి. చూడటానికి ఈ దృశ్యం ఎంతో బాగుంది. దాదాపు అరకిలోమీటరు మేర ఈ అద్భుత దృశ్యం కనిపిస్తుంది. ఈ సుందర ప్రకృతి దృశ్యంతో మది పులకించిపోతుంది. రోడ్డుపై ప్రశాంతంగా ప్రయాణం చేయవచ్చు. దుమ్ము, ధూళి అనేది మచ్చుకు లేదు. ఇంత ప్రశాంతంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు కూడా జరగవు. ఇలాంటి దృశ్యాలు ప్రతిరోడ్డు వెంబడి కనిపించాలని, ఆ దిశగా జిల్లా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం. - ఆంధ్రజ్యోతి, జీ కొండూరు

రోడెక్కితే చాలు ఒకటే దుమ్మూ ధూళి. ఎందుకొచ్చాంరా బాబూ ఈ రోడ్డుపైకి అనుకునేలోపు మనం ప్రయాణించే రోడ్డులో ఓ చెట్టు నీడ రాగానే చల్లదనం తగిలి హాయిగా అనిపిస్తుంటుంది. అదే వందల సంఖ్యలో చెట్లు రహదారికిరువైపులా పచ్చని పందిరేసి చల్లటి నీడినిస్తే.. అబ్బ.. ఇంకేముంది అప్పటి వరకు పడిన ప్రయాణ చిరాకు కాస్త ఇట్టే ఎగిరిపోతుంది. ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఎంతదూరం ప్రయాణం చేసినా అలసట రాదు. అలాంటి ఒక చక్కని రహదారి ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు - కోడూరు గ్రామాల మధ్య ఉంది. రహదారులకిరువైపులా ఉండే చెట్లు నీడనే కాదు. ప్రయాణికులకు ఆహ్లాదాన్నిస్తాయనేందుకు ఈ రెండు చిత్రాలే నిదర్శనం. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు - కోడూరు గ్రామాల మధ్య విస్సన్నపేట - విజయవాడ (వీవీ) రోడ్డులో వెల్లటూరు దాటిన తర్వాత చిన్ననందిగామ క్రాస్ రోడ్డు వరకు ఎత్తైన చెట్లు పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయి. శిశిర రుతువు ఆ చెట్లకు మరింత శోభనద్దాయి. ఈ రహదారిలో ప్రయాణించే వాహనచోదకులకు ఆ చెట్లు ఎంతో హాయిని, ఆహ్లాదాన్నినిస్తున్నాయి. ఏపుగా పెరిగిన కొమ్మలతో రహదారి మొత్తం పచ్చని పందిరి వేసి మంచి నీడనిస్తున్నాయి. వాహన చోదకులకు అక్కడకు రాగానే ఓ మధురానుభూతి పొందేలా చేస్తున్నాయి. రోడ్డంతా ఇలానే ఉంటే ఎంత బాగుండో అనిపించేలా ఉంది ఇక్కడి వాతావరరణం. రహదారి విస్తరణ పేరుతో చెట్లను నరికివేయడమే కాకుండా వాటిస్థానంలో మానవాళికి ప్రాణవాయువును, పచ్చదనాన్నిచ్చే చెట్లను నాటడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇక్కడి రహదారిని పందిరిలా అల్లుకున్న చెట్లు ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తుంటాయనడంతో ఎలాంటి సందేహం లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 35శాతం మేర పచ్చదనం ఉండాలి. కానీ ప్రస్తుతం 25శాతం మాత్రమే ఉందని జిల్లా అధికారులు ఇటీవలే ప్రకటించి మొక్కలు నాటాల్సిన అవసరాన్ని చెప్పారు. కాబట్టి రోడ్ల వెంబడి ఇలా మొక్కలు పెంచితే మన గ్రామాలు మంచి పర్యాటక ప్రాంతాలుగా భాసిల్లుతాయి.


ప్రయాణికులకు హాయినిస్తున్న ఎత్తైన పచ్చని చెట్లు

వృత్తికి న్యాయం చేస్తున్నారా?

ఆత్మపరిశీలన చేసుకోండి

● పీహెచ్‌సీ వైద్యులకు మంత్రి సత్యకుమార్ హితవు

విజయవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాధన హక్కులకు ప్రయత్నాలు చేయడంలో తప్పులేదు పేదలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు చేస్తున్నారా? లేదా? అన్నదానిపై నిత్యం ఆత్మపరిశీలన చేసకుంటూ ఉండాలిలని, పవిత్రమైన వైద్యవృత్తికి న్యాయం చేయాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రల వైద్యులకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు. విజయవాడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల ఆత్మీయ సమ్మేళనం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు వైద్యులందరూ కృషి చేయాలన్నారు. గ్రామీణులకు చేరువలో ఉండే వైద్యులు నిర్దేశించిన వేళల్లో పీహెచ్‌సీల్లో లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ సాయంత్రం వేళల్లో తనిఖీ చేస్తే పీహెచ్‌సీలకు తాళంవేసి ఉండడమేంటని ప్రశ్నించారు. 24 గంటలపాటు పనిచేయాల్సిన పీహెచ్‌ల్లో ఒక్కరూ లేకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు నిర్లక్ష్యం వల్ల ప్రాణం పోయిందన్న అపవాదు రాకూడదని ఇటీవల జరిగిన ఓ సంఘటన గుర్తుచేశారు. వైద్యులు మంచిచేస్తే వెంటనే గుర్తింపు రాదని, కానీ చిన్న తప్పుచేస్తే మాత్రం వేలెత్తి చూపిస్తారన్నారు. పీహెచ్‌సీ వైద్యులు కీలకమైన క్యాన్సర్ స్ర్కీనింగ్-04 బాగా జరిగేలా కృషిచేయాలన్నారు. స్టెమీ విధానాన్ని పటిష్ఠంగా అమలుచేస్తున్నందున గుండెపోటుకు గురైన వారిలో 3వేల మందికిపైగా ప్రాణాలు నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు.


మంత్రిని సత్కరిస్తున్న పీహెచ్‌సీ సంఘం నేతలు

డీఎన్బీ కోర్సులో ప్రవేశాలకు సానుకూలం

ఎంబీబీఎస్ వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటా కింద డీఎన్బీ కోర్సులో ప్రవేశాలు కల్పించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రస్తుత సీట్లు భర్తీ విధానం, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. టైంబాండ్ ట్రైబల్ అలవెన్స్ మంజూరు గురించి ఆర్థిక శాఖ పరిధిలో ఉందని వెల్లడించారు. అనంతరం కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ వైద్యులకు వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి, ప్రాథమిక వైద్యుల సంఘం ముఖ్య ప్రతినిధులు రవీంద్రనాయక్, వినోద్, కిషోర్ పాల్గొన్నారు.


జంక్షన్‌లోని పాలశీతల కేంద్రం వద్ద పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేస్తున్న విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

పాల ఉత్పత్తి వ్యయం తగ్గించడమే లక్ష్యం

● విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తి వ్యయం తగ్గించి పశుపోషణ మరింత లాభసాటిగా ఉండేలా కృషి చేస్తున్నట్టు విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జంక్షన్ క్లస్టర్ పరిధిలోని సంఘాలకు 2వ విడత బోనస్ రూ.1.58 కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణ చేసే రైతులకు ఖర్చులను తగ్గించడానికి అవరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధిక పాల దిగుబడినిచ్చే పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి వాటిని పెంచుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పశు పోషణ భారం కాకుండా చూడాలన్నదే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమన్నారు. మేలు జాతి పశుసంతతి అభివృద్ధి చెందేలా సక్సెస్ సెమన్ అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పశువుల హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతివ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృష్ణా మిల్క్ యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక పాల సేకరణతో అత్యధిక బోనస్‌ను సాధించిన పల్లెర్లమూడి, దిగవల్లి, రమణక్కపేట, గోగులంపాడు, సీతారాంపురం సంఘాలను అభినందించారు. ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ ఎం హరిబాబు వివిధ సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతుల ఇబ్బందుల్ని చూపిస్తున్న కౌలు రైతు సంఘం, రైతు సంఘం నేతలు

రైతుల ధాన్యాన్ని తక్షణం కొనాలి

● ప్రకటించిన మద్దతు ధర అందించాలి

● ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణం ప్రకటించిన మద్దతు ధరకు కొనాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ నేతలు వివరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉందన్నారు. హాయ్ అని వాట్సాప్‌లో పెడితే వెంటనే ధాన్యం కొనుగోలు జరిగిపోతుందని, సమస్యలు వస్తే టోల్ ఫ్రీ నెంబరుకు చెబితే క్షణాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి చెబుతున్నారని, కింది స్థాయిలో ధాన్యం పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కృష్ణాజిల్లా కౌలు రైతు వాకా రామచంద్రరావు మాట్లాడుతూ తేమశాతం పేరుతో రూ. 1400 నుంచి రూ.1470కు మాత్రమే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామ రైతు అన్నే సుబ్బారావు మాట్లాడుతూ కోతలు కోయడానికి యంత్రాలు తక్కువగా ఉన్నాయని, కోత మిషన్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఉండవల్లి ప్రాంత కౌలు రైతు ఇషాక్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నెమ్మదిగా జరుగుతోందని, వర్షాల కారణంగా ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీనియర్ రైతు నేత వై కేశవరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రభుత్వం చెప్పిన దానికి అనుగుణంగా జరగడం లేదన్నారు. గుంటూరు జిల్లా సంఘ నేత జొన్న శివశంకర్, రైతులు పల్లె కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

'కామినేని' మరో మైలురాయి

● పదేళ్లలో అత్యధిక సక్సెస్ రేటు

● 15వేల కార్డియాలజీ ఆపరేషన్లు

పెనమలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అత్యధిక సక్సెస్ రేటుతో పదేళ్లలో 15వేల కార్డియాక్ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించి కామినేని ఆసుపత్రి కీలక మైలురాయిని అధిగమించిందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ఎన్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ఇంద్రప్రస్థ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కామినేని ఆసుపత్రిలో గుండె సమస్యల చికిత్సల్లో అరుదైన ఘనతను సాధించామన్నారు. గుండెపోటు వచ్చినవారు, తీవ్రమైన ఛాతీ నొప్పితో ఆసుపత్రికి వచ్చినవారు, మల్టిపుల్ బ్లాకులున్న రోగుల పట్ల తమ వైద్యుల బృందం వెంటనే స్పందించి సరైన చికిత్స అందిస్తోందని, అందుకే ఎక్కువ ప్రాణాలు రక్షించగలిగామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రతిక్షణం కీలకమే కనుక రోగి ఆసుపత్రికి వచ్చిన వెంటనే ఈసీజీ, ట్రోపో టెస్టు, ఈకో టెస్టు వంటి పరీక్షలను పేషెంటు వచ్చిన 45 నిమిషాల్లోనే పూర్తిచేసి రోగికి అవసరమైన చికిత్సను అందిస్తున్నామన్నారు. కార్డియో థొరాసిక్ సర్జన్‌లు డాక్టర్ సురేష్, డాక్టర్ భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయని, ముఖ్యంగా యువతలో ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, నిద్రలేమి, ధూమపానం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఖచ్చితమైన పరీక్షలు, సత్వర చికిత్స ఎంతో కీలకమన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీలు, వాల్వ్ రీప్లేస్‌మెంట్లు, బైపాస్ సర్జరీలు, బాల్య హృదయ సమస్యల శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులను, సిబ్బందిని ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఆర్ఎస్ వర్ధన్ అభినందించారు. గుండెవ్యాధులపై అవగాహన పెంచడానికి సామాజిక కార్యక్రమాలు, ఉచిత క్యాంపులు, స్ర్కీనింగ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు డాక్టర్ కల్యాణ్, డాక్టర్ అర్చన, క్లస్టర్ హెడ్ పీ సునీల్‌కుమార్, మార్కెటింగ్ హెడ్ రమణారావు పాల్గొన్నారు.



తమ ఆసుపత్రి అధిగమించిన మైలురాయి పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కామినేని ఆసుపత్రి వైద్యులు


గొల్లపూడిలో నాగవంశం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా ఎరుబోతు రమణారావు, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

నాగవంశ కార్పొరేషన్ ఛైర్మన్‌గా

రమణారావు ప్రమాణ స్వీకారం

గొల్లపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు పునర్వైభవం వచ్చిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ నాగవంశం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉమా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలను చట్టసభల్లోకి తీసుకువచ్చి ఎంతో గౌరవం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ అని అన్నారు. టీడీపీ స్థాపించినప్పటి నుంచి బీసీలకు అండగా ఉందని గుర్తు చేశారు. నేడు అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కులాల అభివృద్ధికి టీడీపీ బీజం వేసిందన్నారు. చేతివృత్తులు చేసుకొనే వారికి అనేక పనిముట్లు ఇచ్చి చేయూత అందిస్తున్నట్టు తెలిపారు. తమ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఎరుబోతు రమణారావుకు నాగవంశం కార్పొరేషన్‌కు ఛైర్మన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ తనయుడు గంట రవితేజ మాట్లాడుతూ టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని చెప్పారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి నాగవంశం కార్పొరేషన్‌లో డైరెక్టర్లగా నియమించటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు చెప్పారు. తన ఉన్నతికి ఎంతో కృషిచేసిన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రామ్మోహన్, సుజనా చౌదరి సహాయం ఎన్నటికీ మర్చిపోనన్నారు. తనకిచ్చిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని రాష్ట్ర నలుమూలల తిరిగి నాగవంశం కులంలోని సమస్యలను పరిష్కరిస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానన్నారు. నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్లతోపాటు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

ఘనంగా కొండాలమ్మ ఆలయంలో పూర్ణాహుతి

గుడ్లవల్లేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాస పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలోని అలవేటి మండపంలో రుద్ర సహిత చండీహోమం నిర్వహించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్ర సహిత చండీ హోమం,పూర్ణాహుతిలను అర్చకస్వామి రుద్రపాక శివసంతోష్ శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి మచిలీపట్నం సివిల్ జడ్జి కె.వి. రామకృష్ణయ్య పాల్గొన్నారు. ఆయనను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



చౌటపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి

రైతులకు సరిపడా సంచులు అందజేస్తాం

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సరిపడా సంచులు అందించే బాధ్యత తీసుకుంటున్నట్టు ఏవో బోలెం అనంతలక్ష్మీ తెలిపారు. గురువారం చౌటపల్లి, సెరిదింటకుర్రు గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ బెట్టిన ధాన్యం బాగా ఆరేవరకు ఉంచాలని తెలిపారు. ప్రతి రైతూ ఎటువంటి ఇబ్బంది ఉన్నా వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖలు పరిష్కరిస్తాయని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు లారీలు, సంచులు అందరికీ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు అధైర్యపడకుండా తమ వ్యవసాయ పనులు కొనసాగించాలని చెప్పారు. రైతులు పాల్గొన్నారు

ఘనంగా దత్తాత్రేయుడి జయంతి

పామర్రు : దత్తాత్రేయుడి జయంతిని పురస్కరించుకుని పామర్రులో వేంచేసియున్న సాయినాథుని ఆలయంలో గురువారం భక్తులు సద్గురు సాయినాథునికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళ హారతి చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదే విధంగా మండల పరిధిలో పలుగ్రామాల్లో వేంచేసి యున్న సాయినాథుని ఆలయాల్లో దత్తజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శిథిల వంతెనపై ప్రయాణించేదెలా..!

- ధ్వంసమైన వంతెన రెయిలింగ్
- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

(తోట్లవల్లూరు - ఆంధ్రజ్యోతి) : రొయ్యూరు నుంచి కంకిపాడు వెళ్లే ప్రధాన రహదారిలో ఏనుగులకోడు డ్రెయిన్‌పై వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన పైగా నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఇసుక లారీలు, ట్రాక్టర్లు తిరుగుతూ రద్దీగా ఉంటుంది. పూర్వం నిర్మించిన వంతెన కింద శ్లాబు బలహీనపడి పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. పైన రెయిలింగ్ విరిగిపోయాయి. అధిక బరువుతో ఇసుక లారీలు తిరుగుతుండటంతో వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రొయ్యూరు గ్రామస్థులు ఎన్నో ఏళ్ల నుంచి గ్రామసభల్లోనూ, ప్రజాప్రతినిధులను కలిసి అర్జీలు అందించి కొత్త వంతెన నిర్మించాలని కోరుతూ వస్తున్నారు. అయినా ఈ వంతెనకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించే నాథుడే కరువయ్యాడు. డ్రెయినేజీ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు తమకు ఈ వంతెనతో సంబంధం లేదంటూ తప్పించుకోవటంతో కొత్త వంతెన నిర్మాణానికి నిధులు ఎక్కడ నుంచి వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రజలు మాత్రం ప్రభుత్వం వంతెన నిర్మించాలని ఎదురు చూస్తున్నారు.



రొయ్యూరు ఏనుగులకోడు డ్రెయిన్ వంతెనపై ప్రమాదకరంగా వెళుతున్న ఆటో

వంతెన నిర్మాణం ఎంతో అవసరం



రొయ్యూరు ప్రజలు ప్రతి అవసరానికీ కంకిపాడు వెళుతుంటారు. ఏనుగులకోడు వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన కూలిపోక ముందే కొత్త వంతెన నిర్మించటం అవసరం. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

నిమ్మగడ్డ ప్రభుదాసు, రొయ్యూరు సర్పంచ్

ఆర్‌అండ్‌బీ శాఖదే బాధ్యత

ఏనుగులకోడు డ్రైన్ వంతెన, రోడ్డు లింకు ఉన్న అన్ని వంతెనలను ఆర్‌అండ్‌బీశాఖ నిర్మించాల్సి ఉంది. వంతెన నిర్మాణంతో తమకు సంబంధం లేదు. కేవలం డ్రెయినేజీ బాగోగులు చూడటమే తమ విధి.

మణికంఠ, డ్రెయినేజీ ఏఈ

ఈ వంతెన తమ పరిధిలోనిది కాదు

రొయ్యూరు-కంకిపాడు రోడ్డు ఆర్‌అండ్‌బీ కింద లేదు. ఇది పంచాయితీరాజ్ కింద ఉంది. అందుచేత పంచాయితీరాజ్‌శాఖ కొత్త వంతెన నిర్మించాల్సి ఉంది. మాకు ఎలాంటి సంబంధం లేదు.

మల్లిఖార్జునరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ

అష్టలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుక్లపక్ష పౌర్ణమి సందర్భంగా చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో గణపతి సచ్చిదానంద జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకములు, సహస్రనామార్చన నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా విఘ్న దత్తుడికి తైలాభిషేకం, దత్త హోమం, లక్ష్మీ హోమం, పూజలు నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు.

ప్రజల మంచి కోసమే సంస్కరణలు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మరింత మంచి చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీడీవో సునీతాశర్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు సమాంతరంగా పంచాయతీరాజ్ వ్యవస్థలను పర్యవేక్షించేలా డీడీవో పోస్టులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం డీడీవో కార్యాలయంతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ భవనంలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ అధికారి కార్యాలయం, అసిస్టెంట్ ప్రాజెక్టు డ్వామా కార్యాలయాలను గుడివాడ ప్రత్యేక అధికారి నరసింహులు ప్రారంభించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, డీఎల్‌పీవో సంపత్‌కుమారి, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు.



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజా దర్బార్ ప్రజలకు చక్కటి వేదిక అని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఒకటో గ్రామసచివాలయ వద్ద గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాల్లోని కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇళ్ల స్థలాల మంజూరు కోసం, కొత్త పింఛన్లు , కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని వివిధ సమస్యలపై 26 అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో ఉన్న సమస్యలను తమ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో ఎన్నో సమస్యలను ప్రజాదర్బార్ ద్వారా పరిష్కరం చూపామన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను తక్షణమే ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వివిధ శాఖల అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా ఐకమత్యంతో ముందుకు సాగుతూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరి పల్లి గణేష్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

వైభవంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

గుడ్లవల్లేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులోని భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ సాలికట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు గురువారం ప్రధానంగా స్వామివారు గజవాహనంపై గ్రామంలో విహరించారు. తొలుత సుప్రభాత సేవ, తోమాల సేవ అర్చక కైంకర్యాల అనంతరం ఆలయంలో స్వామివార్లకు గోక్షీరం, గోనెయ్యి, చందనం, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుని గజవాహనంపై డోకిపర్రులోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. వాయిద్యకారులు నృత్యం చేస్తూ ఎంతో ఉత్సాహంగా వాయిద్యాలను మ్రోగిస్తూ స్వామిని ఊరేగించారు. భక్తులు స్వామివార్లకు పూలు, పండ్లు, టెంకాయలు సమర్పించి హారతులిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీవీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో విజయ భాస్కరరెడ్డి, విజయ భాస్కరమ్మ, పి.నాగిరెడ్డి,ప్రసన్న, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



డోకిపర్రులో గజవాహనంపై దేవదేవుని విహారం

ఘనంగా అమ్మవారి కలశ జ్యోతుల ఊరేగింపు

పామర్రు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షల విరమణకు ముందు శుభ సూచికంగా నిర్వహించే అమ్మవారి కలశ జ్యోతుల ఉత్సవ ఊరేంగిపు పామర్రులో కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ దేవత గంగానమ్మ తల్లి ఆలయం వద్ద గురుభవానీలైన మామిళ్లపల్లి చంద్రశేఖర్ రాము గురుభవానీ, పామర్తి మలేశ్వరరావు, పెందుర్తి మహేష్ భవానీల ఆధ్వర్యంలో ఆలయం వద్ద గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తుల రథంతో గ్రామోత్సవం ప్రారంభించారు. లోకకల్యాణార్థం జరిగే ఈ కలశ జ్యోతుల వెలుగుల గ్రామోత్సవం అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రారంభమై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అంకమ్మ తల్లి దేవస్థానం మీదుగా తిరిగి గ్రామోత్సవం గంగానమ్మతల్లి గుడికి చేరుకుని కలశ జ్యోతులను ఆలయంలో సమర్పించారు. బొగ్గవరపు సాయిబాబు గోవిందా గురుస్వాములు, శ్రీనుస్వామి పాల్గొన్నారు.



అమ్మవారి కలశ జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కరుణకుమార్

టేబుల్ టెన్నిస్‌లో గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ కాకినాడ వారిచే అంతర్ యూనివర్సిటీ కళాశాలల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ నిర్వహిచగా శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. వెలగపూడి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించిన చాపియన్‌షిప్, యూనివర్సిటీ టీమ్ ఎంపికల్లో తమ విద్యార్థులు పలు టీమ్‌లపై పోటీపడి మహిళల విభాగంలో ద్వితీయ, పురుషుల విభాగంలో తృతీయ స్థానాలు సాధించారన్నారు. అలానే ఐటీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి.హర్షిత లక్ష్మి , కంప్యూటర్ సైన్స్ నాల్గవ సంవత్సరం చదువుతున్న డి.గంగాధర్‌లు యూనివర్సిటీ టీమ్‌కు ఎంపికయ్యారన్నారు. విజేతలను, వారికి శిక్షణనిచ్చిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివశంకర్, డి.పూజిత, ఎస్.నాగబాబులను కళాశాల యాజమాన్యం, చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహాయ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎంఆర్.సిహెచ్.శాస్త్రిఅభినందించారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక ధనుర్మాస మహోత్సవాలు 16 నుంచి

గుడివాడ : స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు నిర్వహించే వార్షిక ధనుర్మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. గురువారం స్థానిక దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాల కరపత్రాలను ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ధనుర్మాస నెలరోజుల్లో అష్టోత్తర శత నామార్చాన పూజ నిమిత్తం రూ.500లు దేవస్థాన కార్యాలయంలో చెల్లించి గోత్రనామములు నమోదు చేయించుకోవాలని ఆలయ ఈవో గోపాలరావు కోరారు.

రామాలయ నిర్మాణానికి విరాళాలు

పమిడిముక్కల: తాడంకిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి చలపాటి రెడ్డయ్య రూ. 1.02 లక్షల విరాళం యూఎఫ్ ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్, గురజాడ మాజీ సర్పంచ్ జంపాన శ్రీనివాసగౌడ్ ద్వారా గురువారం అందజేశారు. పరిశే శ్రీనివాసరావు రూ. 1.116 లక్షలు పురిటిగడ్డకు చెందిన తాతా సరేంద్ర ఆలయ శిఖరానికి రూ. 20వేలు పులిగంగాధరరావు ద్వారా అందజేశారు.

కృష్ణానదీపాయలో తాత్కాలిక రహదారికి శ్రీకారం

తోట్లవల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు కృష్ణానదీపాయలో గురువారం తాత్కాలిక రహదారి నిర్మాణ పనులకు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు. జూలైలో సంభవించిన వరద మొన్నటి వరకూ కొనసాగింది. ఈ వరదకు గతంలో ఉన్న తాత్కాలిక రహదారి కోతకు గురయింది. ఇప్పుడు వరద తగ్గటంతో మోకాటి లోతునీటిలో దిగి రైతులు, వ్యవసాయ కూలీలు లంక పొలాలకు వెళుతున్నారు. ట్రాక్టర్లు, బైక్‌లు, పంటల రవాణాకు ఇతర వాహనాలు వెళ్లే అవకాశం లేదు. దీంతో దాతల సహకారంతో గ్రామ పెద్దల పర్యవేక్షణలో రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టామని గురుమూర్తి తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు, కుమ్మమూరు పీఏసీఎస్ చైర్మన్ రామినేని రాజా, మైనేని చంటికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు నెక్కలపూడి మురళీ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తాత్కాలిక రహదారి పనులను ప్రారంభించిన గురుమూర్తి

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

● ఎంఈవో రజని కుమారి

గుడివాడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి, ప్రతి విద్యార్థికీ అర్థమయ్యే విధంగా విద్యను బోధించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో రజని కుమారి అన్నారు. గురువారం శేర్విగొల్వేపల్లి, గుంటాకోడూరు పాఠశాలలను ఆమె పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ గుడ్లు, భోజనం ఏ విధంగా లభిస్తుందనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు రాని పిల్లలు ఉంటే ఆయా తల్లిదండ్రులను అడిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఉంటే వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో బాగా విద్యబోధిస్తున్నట్లు, ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తున్నట్లు తెలియజేసి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ప్రతీ ఉపాధ్యాయుడు ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచటానికి కృషి చేయాలని తెలిపారు.



శేరిగొల్వేపల్లి పాఠశాల్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రజనీ కుమారి

తోట్లవల్లూరులో ముమ్మరంగా వరికోతలు



తోట్లవల్లూరులో వరికోతలు కోస్తున్న కూలీలు

తోట్లవల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో గురువారం నుంచి వరికోతలు తిరిగి ప్రారంభమయ్యాయి. వారం రోజులుగా దిత్వా తుపాను ప్రభావంతో చిరు జల్లులు కురవటంతో కోతలను రైతులు ఆపివేశారు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టటం, మిల్లులకు తరలించటం చేశారు. గురువారం సూర్యుడు మబ్బులు వీడి బయటకు రావటంతో రైతులు ధైర్యం చేసి కూలీలతోనూ, యంత్రాలతోనూ వరి కోతలు కోయిస్తున్నారు. ఇక నుంచి వాతావరణం అనుకూలంగా ఉండాలని రైతులు కోరుకుంటున్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఏకగ్రీవం

కూచిపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మొవ్వ మండల శాఖ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ మేరకు గురువారం కూచిపూడిలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకుని ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఆర్థిక కార్యదర్శిగా తుంగల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా నరేంద్ర, జిల్లా కౌన్సిలర్లుగా, పి.వీరబాబు, ఎం.విజయలక్ష్మి, స్వరూపరాణి తదితరులు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక చర్యలు

గుడివాడ : గుడివాడ పురపాలక సంఘ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేసే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రిటైల్, హోల్‌సేల్, ఫుడ్ అవుట్‌లెట్లు, స్ట్రీట్ వెండర్లు తదితర వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. డిసెంబరు 1వతేదీ నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామని, ప్రజలు,వ్యాపారులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. క్లాత్ బ్యాగులు, పేపర్ బ్యాగులు, బయో డీగ్రేడబుల్ బ్యాగులు, పేపర్ గ్లాసులు, చెక్కతో చేసిన కట్లర్ వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలని కమిషనర్ మనోహర్ తెలిపారు.

ఎఫ్‌సీ చలానా ధరలను వెంటనే తగ్గించాలి

గుడివాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీ చలానా ధరలను విపరీతంగా పెంచారని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు దృష్టిసారించి వెంటనే వాటిని తగ్గించాలని ది గుడివాడ పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శివరామకృష్ణ(చంటి) కోరారు. గురువారం స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ విపరీతంగా పెంచడంతో, లారీ ఓనర్లు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎఫ్‌సీ చలానా రేట్‌లను తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఆర్.బి.ఆర్ ప్రసాద్, సభ్యులు కల్యాణ్, నూరుల్లా, సాదిక్, ముజీబ్, ఆసీఫ్, కొండా, హఫీజ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

రెండు దేవాలయాల అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరు

అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రెండు దేవాలయాల అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.రెండున్నర కోట్లు, నాగాయలంకలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న కూటమి నాయకులు

మర్యాదపూర్వకంగా..

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గురువారం రుద్రవారం వచ్చిన సందర్భంగా ఆయనను వీసీ చాంబర్‌లో కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పిప్పళ్ల కాంతారావు, మాజీ కౌన్సిలర్ సనకా నాగులు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డంరాజు, బీజేపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, న్యాయవాది సోడిశెట్టి బాలాజీ, చిలకలపూడి కళాకారిణి సుష్మ కలిసి సత్కరించి, జ్ఞాపికలు, బందరు లడ్డూలు అందజేశారు.

పవన్‌కల్యాణ్‌పై
పేర్ని నానీ విమర్శలు అర్థరహితం

● డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నానీ విమర్శలు అర్థరహితమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. జనసేన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులను సరైన రీతిలో వైసీపీ నాయకులు పరామర్శించలేదన్నారు. పవన్‌కల్యాణ్ సినిమాలో నటిస్తే కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందని, కానీ ఆయన రాజకీయాలకు, ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు ఒకే రోజు 77 ప్రారంభించి ప్రజల వద్దకు పాలనను పవన్ అందుబాటులోకి తెచ్చారన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, వైద్య సౌకర్యం కల్పించిన ఘనత పవన్‌కల్యాణ్‌కే దక్కిందన్నారు. 10 వేల మంది పంచాయతీ రాజ్ ఉద్యోగులకుఒకేసారి పదోన్నతులు ఇచ్చిన ఘనత పవన్‌కల్యాణ్‌కే దక్కిందన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, గల్లా తిమోతి, పినిశెట్టి వేణు పాల్గొన్నారు.

రాజశేఖరస్వామి, లంకమ్మ ఆలయాలకు
పాలకమండళ్ల నియామకం



ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య) | అన్నపరెడ్డి వెంకటస్వామి

అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలోని రెండు ఆలయాలకు కొత్త పాలకమండళ్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. శ్రీరాజశేఖరస్వామి దేవస్థానం బోర్డు చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం నేత, ఆర్యవైశ్య సంఘం నేత ఘంటసాల రాజమోహనరావు(కన్నయ్య)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దివిప్రాంత వాసుల ఇలవేలుపుగా పూజలందుకుంటున్న లంకమ్మ దేవస్థానం బోర్డు చైర్మన్‌గా జనసేన నేత అన్నపరెడ్డి వెంకటస్వామిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయగా, ఈరెండు నియామకాల పట్ల టీడీపీ, జనసేన పార్టీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ కుముదిని సింగ్

ఆటపాటలతో మానసిక వికాసం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక ఎదుగుదలకు ఆటపాటలు దోహదపడతాయని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ ఆర్.కుముదిని సింగ్ అన్నారు. గురువారం పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో విద్యార్థులకు లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రో ఆటలను ఆడించారు. ఈ పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. విజేతలకు కుముదినిసింగ్ బహుమతులు అందజేశారు. ఏఎస్పీ సత్యనారాయణ, పరిశీలకులు శ్రీనివాసరెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ జిల్లా సహిత విద్య సమన్వయకర్త కళ్లేపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

సత్తా చాటిన పెడన విద్యార్థులు

పెడన: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన పోటీల్లో మండలంలోని పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు సత్తా చాటారు. పెనుమల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన మురాల రోహిత్ లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్‌లలో ప్రథమ స్థానం, అతని సోదరుడు సాయికిరణ్ 250 మీటర్లు, 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్‌లలో ప్రథమ స్థానం సాధించాడు. బల్లిపర్రు గురుకుల పాఠశాలకు చెందిన పాము మహేశ్వరి షాట్‌పుట్, లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించింది. తోటమూల హైస్కూల్‌కు చెందిన బొడ్డు హిమబిందు షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానం, పెడన జడ్పీ హైస్కూల్‌కు చెందిన కొసనం కావ్య 400 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లలో తృతీయ స్థానాలు సాధించారు.

గోవుకు సీమంతం



మడక శివాలయంలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

పెడన రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమి సందర్భంగా మడక గ్రామంలోని గంగా పార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయం గోశాలలోని సురభి గోవుకు సీమంతం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు లలితా ఉపాసకుడు గుగ్గిలం కన్నయ్య శాస్త్రి ఆధ్వర్యంలో గోవును ముత్తయిదువులు పసుపు పారాణితో అలంకరించి చీరలు బహూకరించారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

పైడమ్మ జాతర ప్రారంభం

పెడన/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావులు ఉత్సవాలు ప్రారంభించారు. ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రంగుల అలంకరణ కోసం మచిలీపట్నంలోని గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన పైడమ్మ అక్కడ రంగుల అలంకరణ పూర్తి చేసుకుని గురువారం ఉదయం ఊరేగింపుగా పెడన బయలుదేరారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి లక్ష్మీనరసింహారావు, సభ్యురాలు జొన్నలగడ్డ మాధవి, అర్చకుడు లీలాప్రసాద్ తదితరులు లలితా సహస్ర పారాయణ చేసి అమ్మవారికి సారె సమర్పించి సాగనంపారు. అక్కడ నుంచి ఊరేగింపుగా బయలుదేరిన పైడమ్మ గురువారం రాత్రి పెడన చేరుకుంది. అమ్మవారికి శుక్రవారం ఉదయం స్థానిక కాపులవీధిలోని కృష్ణమ్మ బావి వద్ద అత్తింటి వారైన దాసు వంశీయులు, పుట్టింటి వారైన తోట వంశీయులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఆమెను కృష్ణమ్మ బావి నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ ప్రవేశం చేయిస్తారు.



పైడమ్మకు పూజలు చేస్తున్న గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వడ్లమూడి లక్ష్మీ నరసింహారావు తదితరులు, మచిలీపట్నం నుంచి ఊరేగింపుగా పెడనకు బయలుదేరిన పైడమ్మ

బీసీల అభ్యున్నతికి కృషి

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని గూడూరుకు చెందిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు బచ్చుల రామాంజనేయులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు నాయకత్వంలో పనిచేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బొల్లా ఫణిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

● ప్రజాదర్బార్‌లో అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశం



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

కోడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఇరాలి గ్రామం వద్ద రత్నకోడు మేజర్ డ్రైనేజీ నుంచి న్యూ ఇరాలి డ్రెయిన్‌లోకి అక్రమంగా వేసిన తూములు తొలగించాలని, మండలంలో నిషేధిత జాబితాలో ఉన్న 25వేల ఎకరాల భూములకు విముక్తి కల్పించాలని, సత్వరమే ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, హంసలదీవి బీచ్ టోల్‌గేట్ నిలుపుదల చేయాలని, హంసలదీవి గ్రామపంచాయతీలో ఎనిమిది లక్షల శ్రీనిధి నిధులను స్వాహా చేసిన బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలని, పలు సమస్యలపై 50 మంది అర్జీలు అందించినట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 1600 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎండీపీవో సుధాప్రవీణ్, ఎంఈవో రామదాసు, ఎస్సై చాణక్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రం ప్రారంభం

అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో నూతన రైతుసేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూ హాలు ఎదురుగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీపథకం నిధులు రూ.23.94లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.4లక్షలు కలిపి ఈ భవనాన్ని నిర్మించారు. కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమశాతం పరీక్ష, వ్యవసాయ విజ్ఞాన పుస్తక ప్రదర్శన, సిద్ధంచేసిన గోనెసంచులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి, సొసైటీ చైర్మన్ యలవర్తి నాగమునేశ్వరరావు(చిన్నా), తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ విచ్చేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, పీఆర్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ఏఈ సీహెచ్ బ్రహ్మానందబాబు, ఏడీఏ జయప్రద, ఏవో శుభహారిక, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం



మత్స్యకారులకు బోటు లైసెన్సు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మత్స్యశాఖ సహాయక సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మత్స్యకారులను పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అన్నీ నెరవేరుస్తోందని అన్నారు. వేట నిషేధ సమయంలో జీవన భృతి కింద ఏటా రూ.20 వేలు, ఆయిల్ రాయితీ బిల్లు చెల్లిస్తోందని తెలిపారు. నూతనంగా 78 బోట్లకు లైసెన్సు సర్టిఫికెట్లను యజమానులకు ఆయన అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, బొర్రా కాశీ, కూనసాని చిన్నా, వలవల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఘంటసాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గుండె వైద్యనిపుణుడు అరికేరి శివరామకృష్ణ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అన్వర్ షరీఫ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైపస్‌పై అవగాహన

నాగాయలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎదురుమొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.రాజేశ్వరరావు గురువారం నాచుగుంట గ్రామంలో స్క్రబ్ టైపస్ వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. స్క్రబ్ టైపస్ బ్యాక్టీరియా వల్ల కలిగే వ్యాధి, అని ఆరు నుంచి 21 రోజుల్లోపు జ్వరం మొదలవుతుందని, అధిక జ్వరం, తలనొప్పి, శరీరం నొప్పులు, అలసట, కొందరిలో దద్దుర్లు, లక్షణాలు ఉన్న ప్రజలు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకుని మందుల ద్వారా నివారించుకోవచ్చునని తెలిపారు. బి.రాజేంద్ర కుమార్, కె.మౌనిక, కె.జగన్మోహనరావు, నాగ పావని తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం



మచిలీపట్నంలో ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గోపు సత్యనారాయణ, పి.వి.ఫణికుమార్, ఘంటసాలలో నివాళులర్పిస్తున్న గొర్రెపాటి వెంకట రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాయకుడు ఘంటసాల గానం తెలుగువారి హృదయాల్లో అజరామరంగా నిలిచిపోయిందని సాహితీవేత్త డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య అన్నారు. లయన్స్ క్లబ్ హాలు వద్ద ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్‌తో కలిసి ఆయన నివాళులర్పించారు.

ఘంటసాల: ఘంటసాల కళాతోరణం వద్ద ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, రిటైర్డ్ ఎంఈవో పోతన వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. బలే వెంకటేశ్వరరావు, కళాకారులు కొల్లూరి సుబ్బారావు, గంజి చక్రవర్తి, గంజి రాముడు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భవానీల కలశజ్యోతి యాత్ర



చల్లపల్లిలో భవానీల కలశజ్యోతి యాత్రను ప్రారంభిస్తున్న ఎస్సై కె.వై.దాస్

చల్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): భవానీ దీక్షాపరుల కలశజ్యోతి యాత్ర గురువారం రాత్రి చల్లపల్లి పురవీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. గుంటూరు వెంకటేశ్వరరావు గురుభవానీ ఆధ్వర్యంలో భవానీ దీక్షాపరులు కలశజ్యోతి యాత్రను గ్రామదేవత సంపటాలమ్మ ఆలయం వద్ద ప్రారంభించారు. ఎస్ఐ కె.వై.దాస్ కలశయాత్రను ప్రారంభించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, మల్లం నాంచారయ్య, గురుస్వామి వీరబాబు, కారంకి సతీష్, పరిసే రాంబాబు తదితరులు యాత్రలో పాల్గొన్నారు. యాత్ర గ్రామపురవీధుల్లో సాగుతూ తిరిగి సాగర్ థియేటర్ సమీపంలోని అమ్మవారి పడివరకు చేరింది.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

● పరిశీలించిన అధికారులు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని, ట్యాంక్ పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రానికి ఇబ్బందికరంగా మారిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భోగాది జగత్‌కు సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ తెలియజేశారు. ట్యాంక్‌కు ఏమైనా జరిగితే అంగన్వాడీ పిల్లలకు, గ్రామస్థులకు మంచినీరు దొరక్క ఇబ్బంది పడతారని ఏఈకి తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో డీఈ ప్రసన్న, ఏఈ జగత్ వచ్చి ట్యాంక్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి అనిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రభు ప్రభాకర్ పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

పెడన, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ ప్రార్థనా మందిరంలో గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ(చిన్నా) రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కొల్లిపర పూర్ణప్రదీప్, ఉదయగిరి గోపాల్, జల్లూరి రమేష్ తదితర ఆర్యవైశ్యప్రముఖులు పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్‌కు ఎదురుమొండి జడ్పీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగాయలంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎదురుమొండి జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నాయుడు లీలా మనోహర్, విశ్వనాథపల్లి అనూష జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు బడే లలితకుమారి తెలిపారు. గైడ్ టీచర్ కన్నా వెంకటరమణ, సర్పంచ్ కన్నా సుధాకీర్తన, విద్యాకుటుంబం ఆ విద్యార్థులను అభినందించారు.

బ్యాంకు బాకీ వసూలుకు షాపునకు సీలు

చల్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణం తీసుకుని గ్రామం నుంచి వెళ్లిపోయిన వ్యక్తికి చెందిన రెడీమేడ్ షాపునకు బ్యాంకు అధికారులు సీలువేశారు. గ్రామానికి చెందిన మద్దుల వెంకట సుబ్బారావు స్థానిక ఆప్కాబ్ బ్యాంకు నుంచి 2021లో రూ.రెండు లక్షలు రుణం తీసుకున్నాడు. ఈ బ్యాంకు రుణంతోపాటు స్నేహితుల వద్దా, తెలిసినవారి వద్దా, అందినచోటల్లా అప్పులు తీసుకుని గ్రామం నుంచి 2023లో ఉడాయించాడు. దాదాపు అరకోటిపైగా అప్పులు పెట్టి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సుబ్బారావుకు అప్పులు ఇచ్చిన కొందరు అతని రెడీమేడ్ షాపునకు ఎవరికివారు తాళాలు వేసుకోగా, ఆప్కాబ్ బ్యాంకు అధికారులు కోర్టు ఆర్డర్ తీసుకువచ్చి సెప్టెంబరులో షాపునకు తాళాలు వేశారు. తాజాగా గురువారం షాపులో ఎంత స్టాకు ఉందో వివరాలు నమోదు చేసుకుని తిరిగి షాపునకు తాళాలు వేసి సీలు వేశారు. సేకరించిన స్టాకు వివరాలను ఉన్నతాధికారులకు పంపి వాటి విలువ నిర్ణయించి ఆదేశాలు వచ్చాక 15 రోజుల్లో బహిరంగవేలం నిర్వహిస్తామని బ్యాంకు మేనేజర్ కె.కల్యాణి తెలిపారు. సేల్స్ ఆఫీసర్ డి.శివసాయి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ జిల్లా అధికారిణి సరళకుమారి గురువారం అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. ఒకేషనల్ విద్యార్థుల ఆన్‌జాబ్ శిక్షణ తరగతులను చూశారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీరబాబు, చంద్రశేఖర రామారావు, పామర్రు కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రభ పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు



దాతలను సత్కరిస్తున్న కూటమి నేతలు

ఘంటసాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు తమ్మన సోమేశ్వరరావు రూ.8,10,116, దాసం రామకృష్ణ రూ.50,116, కొండవీటి కోటేశ్వరరావు రూ.50,116, కొంగితల అచ్చేశ్వరరావు రూ.50,116లు, సూరపనేని కిషోర్ రూ.50,116లు విరాళం అందించారు. దాతలను గురువారం దేవాలయ ప్రాంగణంలో ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కూటమి నాయకులు సత్కరించారు. ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు, జనసేన నాయకులు కొండవీటి నాని, మాదాసు వినయ్, తమ్మన దినేష్, తమ్మన పవన్ కుమార్, పువ్వాడ రవి, గాదె వెంకటేశ్వరరావు, మేకా పుల్లయ్య, కఠారి తాతయ్య, తమ్మన నారాయణ తదితరులు పాల్గొన్నారు.